

# తీన్మార్

నేటి వాస్తవాలు ...

తెలుగు దిన పత్రిక

teenmaardesk@gmail.com

RNI no TELTEL/2021/86151



తీన్మార్ మెల్కోల్పు

చట్టం & న్యాయం లపై.....

తీన్మార్ తెలుగు దిన పత్రిక

తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో

భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు

రచనలు, కవితలు & వ్యాసాలు

-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-

teenmaardesk@gmail.com




ములుగు | సంపుటి: 04 | సంచిక: 295 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | శుక్రవారం 1 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad


## ఏఐ భస్మాసురుడు లాంటిది

- తప్పుడు చేతుల్లోకి వెళ్తే అంతే సంగతి!
- ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ప్రసంగించిన రాజ్‌నాథ్
- డీప్ ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు రక్షణ రంగంలో కొత్త సవాళ్లను విసిరాయని వెల్లడి



## ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద హైటెక్ భద్రత

- క్యూఆర్ కోడ్ ఉంటేనే లోపలికి ఎంట్రీ: ఈసీ
- కౌంటింగ్ కేంద్రాల వద్ద క్యూ ఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు వ్యవస్థ
- కేంద్రాల వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు చర్యలు




## 226 సీట్లతో గెలుపు మాదే

- బీజేపీ అనుకూల ఎగ్జిట్ పోల్స్ అన్నీ ఫేక్
- బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 226కుపైగా సీట్లు గెలుస్తాం
- టీఎంసీ కార్యకర్తలను నిరుత్సాహపర్చేందుకే బీజేపీ ప్లాన్
- బీజేపీ చెప్పిన ప్రకారం ఎగ్జిట్ పోల్స్ అంచనాలను టీవీ ఛానళ్లలో ప్రసారం చేశారు





## ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావం

- పలు జిల్లాల్లో 3 రోజుల పాటు ఈదురుగాలులతో కూడిన వర్షాలు
- రాష్ట్రవ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం
- ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికం
- ద్రోణి, ఉపరితల చక్రవాక ఆవర్తనంతో రానున్న మూడురోజులు వర్షాలు

హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండల తీవ్రత అధికంగా ఉందని ఐఎండీ అధికారి ధర్మరాజు తెలిపారు. ద్రోణి, ఉపరితల, చక్రవాక ఆవర్తనం, క్యూములోనింబస్ మేఘాల వల్ల రాగల నాలుగైదు రోజులు ఉరుములు, మెరుపులు ఈదురు గాలుల తో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ద్రోణితో పాటు గాలుల్లో ఉన్నటువంటి అనిశ్చితి ప్రస్తుతం కొనసాగుతోంది. - మిగతా3లో

## కాళేశ్వరంపై రేవంత్

# మార్క్ యుద్ధం

- వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది
- ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు
- ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో అత్యంత ప్రతిష్టాత్మకమైన, అదే సమయంలో వివాదాస్పదమైన కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం ఇప్పుడు ఒక కీలక మలుపు తిరిగింది. ప్రాజెక్టు వైఫల్యాలు, నిధుల దుర్వినియోగంపై కేవలం రాజకీయ విమర్శలకే పరిమితం కాకుండా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరికొత్త యుద్ధ తంత్రాన్ని సిద్ధం చేశారు. ఈ వ్యవహారాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ- సీబీఐ చేత దర్యాప్తు చేయించడం ద్వార అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ను, ఇటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఇరకాటంలో పెట్టే వ్యూహానికి రేవంత్ పదును పెట్టారు.సాధారణంగా ఇలాంటి భారీ ప్రాజెక్టులపై విచారణలు న్యాయపరమైన చిక్కుల్లో చిక్కుకుపోతుంటాయి. దీనిని ముందుగానే పసిగట్టిన రేవంత్ సర్కార్ అత్యంత చాకచక్యంగా వ్యవహరించింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కఠిన చర్యలు తీసుకోవద్దని హైకోర్టు తాజాగా మధ్యంతర ఆదేశాలు ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంపిన సీబీఐ సిఫారసులో ఆ కమిషన్ ప్రస్తావన లేకుండా జాగ్రత్త పడింది. దీనికి - మిగతా3లో

TRS

తెలంగాణ రక్షణ సేన

TELANGANA RAKSHANA SENA

### కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు

## ఈసీ గుర్తింపు


- 'టీఆర్ఎస్ నాకే రాసిపెట్టి ఉందేమో'
- టీఆర్ఎస్ పేరును అధికారికంగా కవిత పార్టీకి ఇచ్చిన ఈసీ
- తెలంగాణ రక్షణ సేన పేరును ఆమోదించిన ఈసీ
- ఈనెల 25న టీఆర్ఎస్ పార్టీ పేరు ప్రకటించిన కవిత

హైదరాబాద్

కల్వకుంట్ల కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)'కు ఆమోద ముద్ర వేసింది. తెలంగాణ రక్షణ సేన పేరును ఈసీ ఆమోదించింది. ఈ నెల 25న పార్టీ పేరు తెలంగాణ రాష్ట్ర సేనగా ప్రక టించారు. అయితే తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) - మిగతా3లో

## మరోసారి చిక్కుల్లో విజయ్

- చర్యలు తీసుకోవాలని ఈసీ, పోలీసులకు బాలల కమిషన్ సిఫార్స్
- ఎన్నికల ప్రచార ప్రసంగాల ద్వారా పిల్లలు తమ తల్లిదండ్రుల ఓటు నిర్ణయాలను ప్రభావితం చేసేలా ప్రేరేపించారన్న ఆరోపణలు



## మిస్సైల్ ఫోర్స్ అభివృద్ధిపై భారత్ ఫోకస్

- ట్రయల్స్ దశకు లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిస్సైల్
- దేశ రక్షణ కోసం బహుళ అంచెల మిస్సైల్ ఫోర్స్
- అగ్ని - 6 క్షిపణి పరీక్షకు డీఆర్‌డీఓ సిద్ధం
- త్వరలో హైపర్ సోనిక్ గ్లైడ్ మిస్సైల్ పరీక్ష
- ప్రళయ్ మిస్సైల్ పరీక్షలు తుది దశకు



## 32 ఏళ్ల పోలీసు కెరీర్‌లో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలు

పోలీస్ అకాడమీలో డీజీపీ శివధర్‌రెడ్డికి గౌరవ వీడ్కోలు

పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో శివధర్‌రెడ్డికి గౌరవ వందనం

కార్యక్రమంలో పాల్గొన్న నూతన డీజీపీ సీవీ ఆనంద్



హైదరాబాద్

తన 32 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ జీవితంలో అనేక అనుభవాలు, జ్ఞాపకాలు మిగిలాయని రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన పదవీ విరమణ సందర్భంగా హైదరాబాద్ పోలీస్ అకాడమీలోని పరేడ్ గ్రౌండ్‌లో పోలీసు ఉన్నతాధికారులు ఆయనకు గౌరవ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా శివధర్‌రెడ్డి మాట్లాడుతూ తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పాత పోలీసింగ్ విధానాలతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో మార్పులు వచ్చాయని - మిగతా3లో



## కర్ణాటకలో ప్రస్తుతానికి సీఎం మార్పు లేదు

- స్పష్టం చేసిన కాంగ్రెస్ చీఫ్ ఖర్గే
- నేను కర్ణాటక సీఎం కావాలని మీరు అనుకోవచ్చు
- కానీ నిర్ణయం సోనియా గాంధీదే
- తేల్చిచెప్పిన మల్లికార్జున ఖర్గే
- రాష్ట్రంలోని నాయకత్వ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని స్పష్టం

## అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల

# క్రమబద్ధీకరణ

- మరోసారి ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ
- అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ మరోసారి ఇవ్వాలని నిర్ణయం
- మే 1 నుంచి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ అమలు



హైదరాబాద్

అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజులో 25 శాతం రాయితీ మరోసారి ఇవ్వాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మే 1 నుంచి 31 వరకు ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ అమలు అవుతుందని తెలిపింది. తెలంగాణ రాష్ట్రంలో రాయితీతో కూడిన ఎల్ఆర్ఎస్‌ల రిజిస్ట్రేషన్లకు గడువు మరో మూడు నెలలు ప్రభుత్వం పొడిగించింది. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ చేయిం చుకునే వాళ్లు ఎల్ఆర్ఎస్ ఛార్జీల్లో 25 శాతం రాయితీ ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటి వరకు దాదాపు ఆరు లక్షల - మిగతా3లో

# ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద హైటెక్ భద్రత

కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు భారత ఎన్నికల సంఘం (ఈసీ) కీలక నిర్ణయం తీసుకుంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించడానికి మూడు అంచెల భద్రతా ఏర్పాట్లను ప్రవేశపెట్టనున్నట్లు తెలిపింది. ఇందుకోసం క్యూ ఆర్ కోడ్ ఆధారిత గుర్తింపు వ్యవస్థను ప్రవేశపెట్టనుంది. మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఈ కొత్త వ్యవస్థను అమలు చేయనున్నట్లు ఈసీ పేర్కొంది. అదేవిధంగా, భవిష్యత్తులో జరిగే అన్ని లోక్ సభ, రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో ఈ విధానాన్ని ప్రవేశపెడతామని తెలిపింది. అయితే, కౌంటింగ్ కేంద్రాల్లో గుర్తింపును ధ్రువీకరిచడం కోసం మూడు అంచెల భద్రతా విషయంపై ఈసీ వివరణ ఇచ్చింది. మొదటి, రెండు భద్రతా చెక్ పాయింట్ల వద్ద రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్ఓ) జారీ చేసిన ఫొటో గుర్తింపు కార్డులను మాన్యువల్‌గా తనిఖీ చేస్తారని తెలిపింది. అలాగే, కౌంటింగ్ హాల్ సమీపంలో లోపలి భద్రతా వలయం వద్ద క్యూఆర్ కోడ్ స్కానింగ్ చేసిన తర్వాతే లోపలికి అనుమతి ఉంటుందని పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించడానికి ఈసీ అనుమతి పొందిన వ్యక్తుల కు సైతం ఈ నూతన మార్గదర్శకాలు వర్తిస్తాయని ఈసీ స్పష్టం చేసింది. వీరిలో రిటర్నింగ్ అధికారులు, సహాయ రిట ర్నింగ్ అధికారులు, కౌంటింగ్ సిబ్బంది, సాంకేతిక సిబ్బంది, ఎన్నికల ఏజెంట్లు, కౌంటింగ్ ఏజెంట్లు తదితరులు ఉన్నారు.





**మీడియా కోసం ప్రత్యేక ఏర్పాట్లు**

అలాగే, మీడియా ప్రవేశ ఏర్పాట్లు యథాతథంగా కొనసాగుతాయని ఈసీ తెలిపింది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం ఈసీ జారీ చేసిన అధికార పత్రాల ఆధారంగా గుర్తింపు పొందిన జర్నలిస్టులకు ప్రవేశం కల్పిస్తామని కమిషన్ పేర్కొంది. కౌంటింగ్ కేంద్రాల వద్ద మీడియా కవరేజీని? సులభతరం చేయడానికి ప్రత్యేక మీడియా కేంద్రాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ నూతన విధానాన్ని అమలు చేయడానికి అవసరమైన అన్ని రకాల భద్రతా చర్యలను తీసుకోవాలని రిటర్నింగ్ అధికారులను ఈసీ ఆదేశించింది. ఇందుకోసం చెక్‌పాయింట్ల వద్ద శిక్షణ పొందిన సిబ్బందిని మోహరించాలని సూచించింది. అలాగే, లెక్కింపు ప్రక్రియలో అత్యున్నత స్థాయి పారదర్శకత, భద్రత సామర్థ్యాన్ని పాటించేందుకు ఈ సూచనలను కచ్చితంగా పాటించాలని తెలిపింది. ఈ క్రమంలో, జిల్లా ఎన్నికల అధికారులు, రిటర్నింగ్ అధికారులు, సహాయక రిటర్నింగ్ అధికారులందరికి ఆదేశాలు జారీ చేసింది. ఇదిలా ఉండగా, అసోం, కేరళ, తమిళనాడు, బంగాల్, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ పూర్తైంది. వీటికి సంబంధించి మే 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ క్రమంలో ఈసీ అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. బంగాల్?లో జరిగిన మొదటి దశ ఎన్నికల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించలేదన్న ఆరోపణలపై ఈసీ తనదైన రీతిలో స్పందించింది. డైమండ్ హార్బర్ ప్రాంతానికి చెందిన ఐదుగురు పోలీసు అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సమర్పించిన నివేదిక ఆధారంగా ఆ నిర్ణయం తీసుకున్నట్లు ఈసీ పేర్కొంది. ఎన్నికల విధుల్లో పోలీసుల ప్రవర్తనపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించిన నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంది. కాగా, బంగాల్‌లో రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు అయినట్లు ఈసీ తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బంగాల్‌లో ఇదే అత్యధిక పోలింగ్ శాతమని పేర్కొంది. మొదటి దశలో 93.19 పోలింగ్ నమోదు కాగా, రెండో దశలో 91.66 శాతం పోలింగ్ నమోదైనట్లు ఈసీ వెల్లడించింది. గతంలో బంగాల్‌లో అత్యధిక పోలింగ్ 84.72 శాతంగా (2011 సాధారణ ఎన్నికలు) ఉండేదని ఈసీ పేర్కొంది.

# మరోసారి చిక్కుల్లో విజయ్

తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. విజయ్‌పై చర్యలు తీసుకోవాలని తమిళనాడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పోలీస్ శాఖతో పాటు ఎన్నికల సంఘానికి సిఫార్సు చేసింది. పిల్లలను భావోద్వేగపరంగా ప్రేరేపించి, ుఎఖకి ఓటు వేసేలా తమ తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చేలా చేసి వారిని ఓట్లు సేకరించే సాధనంగా విజయ్ ఉపయోగించుకున్నారని కమిషన్ పేర్కొంది. ఎన్నికల ప్రచార ప్రసంగాల ద్వారా పిల్లలు తమ తల్లిదండ్రుల ఓటు నిర్ణయాలను ప్రభావితం చేసేలా ప్రేరేపించారన్న ఆరోపణల నేపథ్యంలో కమిషన్ ఈ నిర్ణయం తీసుకుంది. “ఎన్నికల ప్రచారానికి సంబంధించిన వివిధ చట్టాల ప్రకారం పిల్లలను సహాయకులుగా లేదా సామాన్య ప్రజలను చేరుకోవడానికి ఒక మాధ్యమంగా ఉపయోగించడం నిషేధం. ఈ విషయంలో తమిళ వెట్రి కళగం నాయకుడు జోసెఫ్ విజయ్, ఆయన ప్రచార విభాగం తమ రాజకీయ పార్టీని సామాన్య ప్రజలకు చేరవేయడానికి పిల్లలను సహాయకులుగా, మాధ్యమంగా చాలా చాకచక్యంగా ఉపయోగించుకున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. ఇది ఏమాత్రం అనుమతించే వ్యూహం కాదు. ఈ క్రమంలోనే ఆయన బాలల న్యాయ (సంరక్షణ, రక్షణ) చట్టం, 2015లోని సెక్షన్లు 75, 83లను ఉల్లంఘించారు. అందువల్ల, ఎన్నికల నిబంధనలను ఉల్లంఘించినందుకు విజయ్‌పై అధికారిక విచారణ జరపాలి.



**తమిళనాడు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్**

మరోవైపు పిల్లలను రెచ్చగొట్టే విధంగా ఉన్న విజయ్ ప్రసంగాలు ప్రస్తుతం సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, యూట్యూబ్‌లో ప్రచారం అవుతున్నాయని బాలల కమిషన్ గుర్తుచేసింది. అలాంటి కంటెంట్‌ను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. “అయితే, పెద్దలు ఇలాంటి చట్టపరమైన ఉల్లంఘనలపై ఫిర్యాదులు చేసే అవకాశం ఉంటుంది. కానీ పిల్లలకు చట్టపరమైన నిబంధనల గురించి అవగాహన ఉండే అవకాశం లేదు. అందువల్లే, పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ సంస్థ విజయ్‌పై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తోంది.” అని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ పేర్కొంది.

2026 అసెంబ్లీ ఎన్నికల సమయంలో టీవీకే పార్టీ జోరుగా ప్రచారం చేసింది. ఈ క్రమంలోనే ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ుఎఖ అధినేత విజయ్, పిల్లలు తమ తల్లిదండ్రులను ‘ఈల’ గుర్తుకు ఓటు వేయమని చెప్పాలంటూ సూచించారు. ఈ ప్రసంగం తర్వాత విజయ్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి వివిధ వర్గాల నుంచి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆయనపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లు తీవ్రమయ్యాయి. రాజకీయ ప్రయోజనాల కోసం పిల్లలను ప్రేరేపించడం చట్టవిరుద్ధమైన చర్య అని విమర్శలు వచ్చాయి.

**ఆలయాలను సందర్శిస్తున్న విజయ్**

ఇదిలా ఉండగా ఎన్నికల ముగిసిన తర్వాత సినీనటుడు, తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ వరసగా దేవాలయ పర్యటనలు చేస్తున్నారు. బుధవారం మహారాష్ట్రలోని ప్రసిద్ధ షిర్డీ సాయిబాబా ఆలయాన్ని సందర్శించారు. షిర్డీ చేరుకున్న ఆయనకు ఆలయ పూజారులు, అధికారులు ఘనస్వాగతం పలికారు. సాయిబాబా ఆలయంలో విజయ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాబా సమాధిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట టీవీకే పార్టీకి చెందిన ముఖ్య నాయకులు ఉన్నారు. ఈనెల 23న ముగిసిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం విజయ్ ప్రార్థనలు చేశారని టీవీకే వర్గాలు తెలిపాయి. విజయ్ రాకతో షిర్డీ ఆలయ పరిసరాల్లో సందడి నెలకొంది. తమ అభిమాన నటుడిని చూసేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు, అభిమానులు అక్కడికి చేరుకున్నారు. అంతకుముందు తమిళనాడులోని తూత్తుకుడి జిల్లా తిరుచెందూరులో ఉన్న ప్రసిద్ధ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ అర్చకులు విజయ్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి ఆయుధమైన బల్లెం, శాలువాతో విజయ్‌ను సత్కరించారు. స్వామి నిజరూప దర్శనంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట టీవీకే ప్రధాన కార్యదర్శి ఆనంద్, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు. విజయ్‌ను చూసేందుకు ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలి వచ్చారు.

# మిస్సైల్ ఫోర్స్ అభివృద్ధిపై భారత్ ఫోకస్

క్షిపణులు, స్టెల్త్ విమానాలు సమన్వయంతో పనిచేసే టూ పంచ్ వ్యూహాత్మక సామర్థ్యాన్ని పొందే దిశగా భారత్ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా స్వల్ప, మధ్య, దీర్ఘ శ్రేణులను కలిగిన బహుళ అంచెల సంప్రదాయ క్షిపణి దళాన్ని (మిస్సైల్ ఫోర్స్) అభివృద్ధి చేయడంపై ఫోకస్ పెట్టింది. ఇక ఇదే సమయంలో అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ కార్యక్రమాన్నీ వేగవంతం చేస్తోంది. మరోవైపు మనదేశ లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిస్సైల్ కార్యక్రమం సైతం ట్రయల్స్ దశకు సమీపించింది. సర్కారు అనుమతి లభించగానే అగ్ని-6 అడ్వాన్స్‌డ్ ఇంటర్ కాంటినెంటల్ బాలిస్టిక్ మిస్సైల్‌ను ప్రయోగించేందుకు రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) సమాయత్తమైంది. 2029 నాటికి రూ.50వేల కోట్లకుపైగా రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేయాలనే లక్ష్యాన్ని భారత్ నిర్దేశించుకుంది. గురువారం దిల్లీలో జరిగిన జాతీయ భద్రతా సదస్సు 2.0 వేదికగా ప్రభుత్వ వర్గాలు వెల్లడించిన వివరాలతో కథనమిది.

**బహుళ అంచెల మిస్సైల్ ఫోర్స్ ఏర్పాటు**

వ్యూహాత్మక ప్రతిస్పందన సామర్థ్యాల బలోపేతం కోసం బహుళ అంచెల మిస్సైల్ ఫోర్స్‌ను భారత్ ఏర్పాటు చేస్తోందని రక్షణ శాఖ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ ప్రకటించారు. పశ్చిమాసియా యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలలో క్షిపణుల వినియోగం అనేది వ్యూహాత్మక నిరోధకత స్థాయి నుంచి యుద్ధరంగ ఆవశ్యకత స్థాయికి మారిందని ఆయన గుర్తుచేశారు. అందుకే స్వల్ప, మధ్య, దీర్ఘశ్రేణులలో మిస్సైల్ ఫోర్స్‌ను సమాయత్తం చేసుకోవడంపై భారత్ ఫోకస్ పెట్టిందన్నారు. గురువారం దిల్లీలో జరిగిన జాతీయ భద్రతా సదస్సు 2.0లో రాజేశ్ కుమార్ సింగ్ మాట్లాడారు.

**ఏదో ఒక దేశంపై అతిగా ఆధారపడటాన్ని తగ్గించాలి**

రక్షణ రంగ ఉత్పత్తుల కోసం ఏదో ఒక దేశంపై అతిగా ఆధారపడటాన్ని భారత్ తగ్గించాలని రాజేశ్ కుమార్ సింగ్ సూచించారు. అమెరికా, రష్యా, చైనా లాంటి దేశాలు యుద్ధ విమానాల తయారీ కోసం ఏకకాలంలో రెండు వేర్వేరు కంపెనీలతో కలిసి పనిచేస్తున్నాయని, చైనాలోనైతే కొన్నిసార్లు ఆ రెండు ప్రాజెక్టులనూ ప్రభుత్వ కంపెనీలకే అప్పగిస్తున్నారని ఆయన తెలిపారు. భారత రక్షణ రంగం సైతం ఈవిధమైన వైవిధ్యం దిశగా ముందుకుసాగితే దీర్ఘకాలంలో వ్యూహాత్మక ప్రయోజనం లభిస్తుందన్నారు. అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ –ాూవీజూా) కార్యక్రమంలో భాగంగా అధునాతన యుద్ధ విమానాల నమూనాల రూపకల్పన దశలో హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) భాగం కాకపోవడంపై రాజేశ్ కుమార్ స్పందించారు. ఏఎంసీఏ కార్యక్రమం తదుపరి దశలలో హెచ్ఏఎల్ పాల్గొనే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఏఎంసీఏ యుద్ధ విమానాల ఉత్పత్తి దశలో ఆ కంపెనీకి అవకాశం లభించొచ్చని తెలిపారు. వ్యూహాత్మక ప్రతిస్పందన, సప్లై చైన్ వ్యవస్థలలోని బలహీనతలను ఎదుర్కొనేందుకే రాఫెల్, ఏఎంసీఏ యుద్ధ విమానాల తయారీకి రెండు వేర్వేరు ఉత్పత్తి లైన్లను భారత్ నిర్వహిస్తోందన్నారు.

**రూ.50వేల కోట్ల రక్షణ ఉత్పత్తుల ఎగుమతే లక్ష్యం**

“2029 నాటికి రూ.50వేల కోట్లు విలువైన రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేయాలనే లక్ష్యాన్ని భారత్ పెట్టుకుంది. ఇది పెద్ద సమస్యేం కాదు. భారత్ అవలీలగా ఈ లక్ష్యాన్ని సాధిస్తుంది. 2025లోనూ రూ.38వేల కోట్లు విలువైన రక్షణ రంగ ఉత్పత్తులను ఎగుమతి చేశాం. 2024తో పోలిస్తే ఇది 61 శాతం ఎక్కువ. ఈ లెక్కన 2030 నాటికి లక్ష్యానికి (రూ.50వేల కోట్లు) మించిన రేంజులో రక్షణ ఉత్పత్తులను భారత్ ఎగుమతి చేయగలదు. ఇప్పటికే ఈ విభాగంలో భారత్ గణనీయమైన, వేగవంతమైన వికాసాన్ని సాధించింది. ప్రస్తుతం చాలా దేశాల మధ్య సైనిక ఘర్షణలు జరుగుతున్నందున సంప్రదాయ ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఆర్టిల్లరీ షెల్స్ వంటి వాటికి డిమాండ్ పెరిగింది. గతేడాది భారత్ రక్షణ ఎగుమతులు పెరగడానికి ఇదే కారణం. భారత్ రక్షణ ఎగుమతుల్లో ఎక్కువ వాటా ప్రభుత్వరంగ కంపెనీలదే. 2024లో రక్షణ ఎగుమతుల్లో సింహభాగం వాటాను ప్రైవేటు రంగం సాధించింది. భారతదేశ ఆయుధాలను చాలావరకు ఆసియా, ఆఫ్రికా దేశాలు బలమైన నమ్మకంతో కొంటున్నాయి. ఈనేపథ్యంలో భారత రక్షణ రంగ కంపెనీలతో పాటు వాటి నుంచి ఆయుధాలను కొనే దేశాల కోసం లైన్ ఆఫ్ క్రెడిట్ (రుణ సహాయ) స్కీంను తేవడంపై కసరత్తు జరుగుతోంది. దీని ద్వారా ఆర్డర్లు ఇవ్వడం, తీసుకోవడం చేయొచ్చు” అని రాజేశ్ కుమార్ సింగ్ చెప్పారు.

**యూరోపియన్ల అభద్రత : భారత్‌కు అవకాశాలు**

“అమెరికా అండపై యూరోపియన్లు అభద్రతా భావంతో ఉన్నారు. దీంతో కొన్ని కూటములు విచ్ఛిన్నం అవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో చాలా ఐరోపా దేశాలు భారీ స్థాయి రక్షణ పారిశ్రామిక భాగస్వామ్యాల కోసం భారత్‌తో బిజినెస్ టు బిజినెస్ (బీ2బీ) చర్చలు జరుపుతున్నాయి. కొన్ని దేశాలు ఇటీవలె భారత్‌తో వ్యూహాత్మక భాగస్వామ్య ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. ఐరోపా దేశాలు రక్షణ రంగ టెక్నాలజీని భారత్‌కు బదిలీ చేసి, ఇక్కడ రక్షణ ఉత్పత్తులను తయారు చేయించుకునేందుకు మొగ్గు చూపుతున్నాయి. ఎందుకంటే ఆ దేశాల దగ్గర చౌకైన మానవ వనరులు లేవు. ఇటీవలే ఇటలీ రక్షణ మంత్రి భారత్‌లో పర్యటించింది అందుకోసమే. నాటో కూటమిలో ఏర్పడిన విభేదాల వల్ల ఫ్రాన్స్ అణ్వస్త్ర కవచాన్ని వాడుకునే ప్రయత్నాల్లో జర్మనీ నిమగ్నమై ఉంది. ఈ పరిణామాలతో భారత రక్షణ రంగానికీ కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయి. సప్లై చైన్ భద్రత, విశ్వసనీయతలలో భారత్‌ను ఐరోపా దేశాలు నమ్ముతున్నాయి” అని రాజేశ్ కుమార్ సింగ్ పేర్కొన్నారు.

**అగ్ని – 6 ఖండాంతర క్షిపణి పరీక్షకు రెడీ : డీఆర్‌డీఓ**

కేంద్రం నుంచి అనుమతి లభించగానే అగ్ని-6 అధునాతన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షకు తాము సిద్ధమని డీఆర్‌డీఓ ఛైర్మన్ సమీర్ వీ కామత్ వెల్లడించారు. లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిస్సైల్ (ా=–ూాష్ట్రవీ)కు సంబంధించిన హైపర్ సోనిక్ గ్లైడ్ మిస్సైల్ కార్యక్రమం సైతం అడ్వాన్స్‌డ్ దశకు చేరిందని ఆయన తెలిపారు. త్వరలోనే దానితో ట్రయల్స్ జరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. లాంగ్ రేంజ్ యాంటీ షిప్ మిస్సైళ్లలో హైపర్ సోనిక్ గ్లైడ్, హైపర్ సోనిక్ క్రూజ్ అనే రెండు రకాల మిస్సైళ్ల తయారీపైనా భారత్ పనిచేస్తోందని సమీర్ వీ కామత్ తెలిపారు. అభివృద్ధిపరంగా చూస్తే, ప్రస్తుతానికి హైపర్ సోనిక్ గ్లైడ్ మిస్సైల్ వేరియంట్లే ముందంజలో ఉన్నాయన్నారు. త్వరలోనే ఈ వేరియంట్‌ను పరీక్షించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

**హైపర్‌సోనిక్ గ్లైడ్ క్షిపణి రాడార్లకు దొరకదు**

హైపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిలో స్క్రామ్‌జెట్ ఇంజిన్

## ఏఐ భస్మాసురుడు లాంటిది

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏఐ వినియోగాన్ని పౌరాణిక రాక్షసుడైన ‘భస్మాసురుడి’తో పోల్చారు. ఈ సాంకేతికత తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే అనేక రంగాలను ప్రభావితం చేయగలదని అభిప్రాయపడ్డారు. డీప్ ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు రక్షణ రంగంలో కొత్త సవాళ్లను విసిరాయని అన్నారు. ఏఎన్ఐ నేషనల్ సెక్యూరిటీ సమ్మిట్ 2.0లో ప్రసంగించిన ఆయన ఈ మేరకు ఈ వ్యాఖ్యలు చేశారు. “రక్షణ మంత్రిగా దేశ భద్రతా వ్యవస్థను చాలా వివరంగా అర్థం చేసుకునే అవకాశం నాకు లభించింది. అందువల్ల, ఏఐకి సంబంధించిన ఆందోళనలను గమనించాను. ప్రస్తుత సమయంలో డీప్ ఫేక్‌లు, సైబర్ యుద్ధం, స్వయంప్రతిపత్తి గల ఆయుధ వ్యవస్థలు కొత్త సవాళ్లను విసురుతున్నాయి. మనం ఈ సవాళ్లను దృష్టిలో ఉంచుకోవాలి. ఎందుకంటే భవిష్యత్తులో ఈ సవాళ్లు తగ్గకపోగా తిరిగి మరింతగా పెరుగుతాయి. ప్రతి సాంకేతికతకు రెండు కోణాలు ఉంటాయని కూడా మనం అర్థం చేసుకోవాలి. ఏఐ విషయానికి వస్తే, ఈ ద్వంద్వ వినియోగ సందిగ్ధత మరింత తీవ్రమవుతుంది. ఈ శక్తివంతమైన ఏఐ మోడల్? సాఫ్ట్‌వేర్‌లోని బలహీనతలను వెతికి వాటిని ఉపయోగించుకోగలదు. ఈ నమూనా బ్యాంకింగ్ వ్యవస్థలు, ఆసుపత్రులు, విద్యుత్ గ్రిడ్‌ను బలోపేతం చేయగలదు. అయితే, ఏఐ తప్పుడు వ్యక్తుల చేతుల్లోకి వెళితే వీటన్నింటినీ నాశనం చేయగలదు. నేను దీనిని మన పౌరాణిక కథల్లోని భస్మాసురుడితో పోలుస్తాను. శివుడు అతడికి ఒక వరం ఇచ్చాడు. కానీ అదే వరం అతడికి శాపంగా మారింది.” భారత సాయుధ దళాలతో ఏఐని అనుసంధానించడంపైనా రక్షణ మంత్రి రాజ్?నాథ్ సింగ్? స్పందించారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థల కచ్చితత్వాన్ని పెంచడంలో దీని వినియోగించినట్లు గుర్తు చేశారు. రక్షణ రంగంలో ఏఐ వినియోగానికి ఉదాహరణగా సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ క్షిపణి వ్యవస్థలను ఉదహరించారు. “మీరందరూ సుదర్శన్ ఎయిర్ డిఫెన్స్ గురించి విని ఉంటారు. కొందరికి దాని గురించి తెలిసి కూడా ఉండవచ్చు. ఇది ఒక భారీ, ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఉత్తమ వినియోగానికి ఇదే ఒక గొప్ప ఉదాహరణ. ఏఐ, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా సైన్స్‌లను ఉపయోగించి కొత్తగా వస్తున్న ఏఐ ఆధారిత సవాళ్లకు ప్రతిస్పందనగా మన సాయుధ దళాలు తమ సామర్థ్యాలను బలోపేతం చేసుకోవడానికి ఒక రోడ్‌మ్యాప్‌ను కూడా అభివృద్ధి చేశాయి. ఇది భవిష్యత్తులో వారిని మరింత పోటీతత్వంగా మార్చడంలో ప్రభావవంతంగా పనిచేస్తోంది. ఇలా కొత్తగా వస్తున్న సాంకేతికతలతో మన దేశం మరింత సురక్షితంగా మారడమే కాకుండా, సాధికారతను సంపాదిస్తుంది. ఆపరేషన్ సిందూర్‌లో అన్ని రంగాల్లో ూ×ని సమర్థవంతంగా ఉపయోగించుకున్నాము. మా నిఘా వర్గాలను అత్యాధునిక బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థతో కలపడం వల్ల మా కచ్చితత్వం మెరుగుపడి, దాడి సామర్థ్యాలను తదుపరి స్థాయికి తీసుకెళ్లేందుకు వీలయ్యింది.” పదవీ విరమణ చేసిన అధికారులకు పింఛను ప్రక్రియను సులభతరం చేయడానికి కేంద్రం ఏఐ ఆధారిత చెక్ బోర్డును అభివృద్ధి చేసిందని రాజ్?నాథ్ సింగ్? చెప్పారు. “ఏఐపై నా అభిప్రాయం కేవలం యుద్ధానికే పరిమితం కాదు. ప్రస్తుతం మన పని సంస్కృతికి, సైనికుల సంక్షేమానికి, జీవన ప్రమాణాలను పెంచడానికి ఒక శక్తివంతమైన మాధ్యమంగా ఏఐ మారింది. మా పింఛనుదారులు, మాజీ సైనికుల కోసం మేము ఒక పోర్టల్‌ను కూడా అభివృద్ధి చేశాము. ఏఐ ఆధారిత చెక్ బోర్డు ద్వారా పింఛనుకు సంబంధించిన ప్రక్రియలను మరింత సులభతరం చేశాం” అని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వివరించారు.

## 226 సీట్లతో గెలుపు మాదే

బంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో 226కుపైగా సీట్లు గెలుస్తామని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి, సీఎం మమతా బెనర్జీ విశ్వాసాన్ని వెలిబుచ్చారు. టీఎంసీ కార్యకర్తలను నిరుత్సాహపర్చేందుకే బీజేపీ చెప్పిన ప్రకారం ఎగ్జిట్ పోల్స్ అంచనాలను టీవీ ఛానళ్లలో ప్రసారం చేశారని ఆమె ఆరోపించారు. బీజేపీ ఆఫీసు నుంచి అందిన సమాచారం ప్రకారమే టీవీ ఛానళ్లు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ప్రసారం చేశాయని మమత మండిపడ్డారు. ఈ మేరకు ఒక వీడియో సందేశాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె విడుదల చేశారు. బంగాల్‌లో బీజేపీకే గెలుపు అవకాశాలు ఎక్కువంటూ బుధవారం సాయంత్రం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై దీదీ చేసిన తాజా వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## కర్ణాటకలో ప్రస్తుతానికి సీఎం మార్పు లేదు



కర్ణాటక రాజకీయాల్లో గత కొంత కాలంగా కొనసాగుతున్న సీఎం మార్పు ఊహాగానాలకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెరదించారు. కర్ణాటకలో ప్రస్తుతానికి ముఖ్యమంత్రి మార్పు ఏదీ లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని నాయకత్వ సమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందని ఆయన గురువారం స్పష్టం చేశారు. “ప్రస్తుతానికి సీఎం మార్పు అనే ప్రశ్నే లేదు. ఇప్పటికే ఒక ముఖ్యమంత్రి ఉన్నారు. ఒక వేళ సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, నేను కలిసి మార్పు దిశగా ఏదైనా నిర్ణయం తీసుకోవాల్సి వస్తే, దానికి కొంత సమయం పడుతుంది. అప్పటి వరకు వేచి చూడాలి.”

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలతోపాటు, కర్ణాటకలోని రెండు అసెంబ్లీ స్థానాల ఉపఎన్నికల ఫలితాలు మే4న వెలువడనున్నాయి. ఈ ఫలితాల అనంతరం కర్ణాటకలో సీఎం మార్పు, మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ హైకమాండ్ కీలక నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం జోరుగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఖర్గే తాజా వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత నేటి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్? మధ్య ఓ ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం శివకుమార్?కు శివకుమార్?కు సీఎం పదవి ఇవ్వాలని ఆయన మద్దతుదారులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. అనుభవజ్ఞుడైన ఖర్గే కర్ణాటక ముఖ్యమంత్రి అయితే పార్టీలోని అందరూ స్వాగతిస్తారని కర్ణాకట హోంమంత్రి పరమేశ్వర బుధవారం వ్యాఖ్యానించారు. దీనిపై ఖర్గే ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. “నేను ముఖ్యమంత్రి అయితే బాగుంటుందని మీరు (మీడియా), ఆయన (పరమేశ్వర), ప్రజలు అనుకోవచ్చు. కానీ నా తలరాత కంటే కూడా, నా సిద్ధాంతాలు, పార్టీకి నేను చేసిన సేవను బట్టి నా విషయంలో సోనియా గాంధీ నిర్ణయం తీసుకుంటారు” అని ఆయన తేల్చిచెప్పారు. 2025 నవంబర్ 20 నాటికి కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ ఏర్పడి రెండున్నర ఏళ్లు పూర్తి అయ్యింది. ఈ నేపథ్యంలోనే నాయకత్వ మార్పులు చర్చలు, ఊహాగానాలు ముదిరాయి. ఇదిలా ఉండగా, వచ్చే నెలలో దాదాపు 40 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు దిల్లీ టికెట్లు బుక్? చేసుకున్నారని కేంద్ర మంత్రి హెచ్?డీ కుమారస్వామి అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఖర్గే స్పందిస్తూ, ‘నాకు ఆ విషయం తెలియదు. ఆ వివరాలు ఏమిటో ఆయననే అడగండి’ అని పేర్కొన్నారు.

**కేరళ, తమిళనాడులో విజయం ఖాయం!**

బుధవారం వెలువడిన ఎగ్జిట్ పోల్స్ అంచనాలపై కూడా ఖర్గే స్పందించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి తిరిగి అధికారం దక్కించుకుంటుందని అన్నారు. అలాగే కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్? ఘనవిజయం సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

**అసోం, పుదుచ్చేరి పరిస్థితేంటి?**

కాగా, అసోం, పుదుచ్చేరిలో అధికార పక్షాన్ని గద్దె దించడం కాంగ్రెస్‌కు సవాలుతో కూడు కున్న విషయమని ఖర్గే అంగీకరించారు. “అసోం ఎగ్జిట్ పోల్స్ మాకు తక్కువ సీట్లు వస్తా యని చెబుతున్నాయి. కానీ అంచనాల కంటే మాకు ఎక్కువ సీట్లు వస్తాయనే నమ్మకం ఉంది. పుదుచ్చేరిలో కూడా బీజేపీ-ఎన్?ఆర్ కూటమితో మేము సమంగా పోరాడాం. అక్కడ గట్టి పోటీ నెలకొంది. మరి కొద్ది రోజులు వేచి చూడాలి” అని ఆయన అన్నారు.

**బంగాల్‌లో హోరాహోరీ**

బంగాల్‌లో టీఎంసీ, బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉందని ఖర్గే అభిప్రాయపడ్డారు. “మాకున్న సమాచారం ప్రకారం అక్కడ టీఎంసీ ఆధిక్యంలో ఉంది. అయితే కేంద్ర బలగాలను మోహరించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మమతా బెనర్జీకి బీజేపీ గట్టి సవాల్ విసిరేందుకు ప్రయత్నించింది” అని ఆరోపించారు. ఒక వేళ హంగ్? వస్తే టీఎంసీకి మద్దతు ఇస్తారా? అని విలేకరులు ప్రశ్నించగా, “ఇప్పుడే ఏమీ చెప్పలేం. ఫలితాల తర్వాత నిర్ణయం తీసుకుంటాం” అని ఖర్గే పేర్కొన్నారు.

# ద్రోణి, ఉపరితల ఆవర్తన ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

ఇది దక్షిణ అంతర్గత కర్ణాటక వరకు కొనసాగుతూ గల్ఫ్ ఆఫ్ మన్నార్, తమిళనాడు వరకు సముద్ర మట్టానికి 900 మీటర్ల ఎత్తులో వెళ్తోంది. అంతేకాకుండా ఉపరితల చక్రవాకం కూడా రాష్ట్ర సరిహద్దుల్లో అంతర్గత మహారాష్ట్ర వరకు కొనసాగుతూ తెలంగాణ రాష్ట్రం మీదుగా సముద్ర మట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తున కొనసాగడం వల్ల ఒకవిధంగా పగటి ఉష్ణతీవ్రత అధికంగా ఉన్నప్పటికీ స్థానికంగా ఏర్పడే వాతావరణ పరిస్థితుల కారణంగా మబ్బుల్లో నీటి ఆవిరి ఉండి ఉదయం అధిక ఎండతీవ్రత, సాయంత్రం కొంచెం చల్లని వాతావరణం కనిపిస్తోంది. ఉత్తర తెలంగాణ భాగంలో ఎండ తీవ్రత అధికంగా కొనసాగుతున్నప్పటికీ ఒక విధంగా సాయంత్రం సమయంలో ఏర్పడే క్యుములోనింబస్ మేఘాల వల్ల ఎండ తీవ్రత నుంచి స్వల్ప ఉపశమనం లభిస్తున్నట్లు చెప్పాలి. ఒక విధంగా నిన్న నమోదయిన గణాంకాల ప్రకారం ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 44 డిగ్రీల వరకు ఉష్ణతీవ్రత కొనసాగగా నిజామాబాద్?లో 44 డిగ్రీలు నమోదైంది. హైదరాబాద్?, చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు 40 డిగ్రీలు ఉంది. హయత్?నగర్ 41 డిగ్రీలు, పటాన్?చెరు 39 డిగ్రీల వరకు ఉష్ణతీవ్రత కొనసాగుతోంది. రాజేంద్ర నగర్?లో 41 డిగ్రీలు వరకు ఎండ తీవ్రత కొనసాగుతోంది.

దక్షిణ జిల్లాలైన సంగారెడ్డి, వికారాబాద్, హైదరాబాద్, ఉమ్మడి మహబూబ్?నగర్, నారాయణపేట్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలతో పాటు ఈదురుగాలులు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో పయనించే అవకాశం కనిపిస్తోంది. ఏప్రిల్?లో నాలుగైదు రోజులుగా ఆదిలాబాద్?, నిజామాబాద్?లో 45



డిగ్రీల వరకు ఉష్ణ తీవ్రత కొనసాగుతుండగా మే నెలలో సగటు కూడా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏప్రిల్?లో 42 డిగ్రీల వరకు సరాసరి ఉష్ణోగ్రతలు ఉంటే మే నెలలో ఉష్ణతీవ్రత గణాంకాలు మారే అవకాశాలు కనిపిస్తోంది. ఒకటి నుంచి రెండు డిగ్రీలు ప్రస్తుతం ఉన్న దానికంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఎండ తీవ్రత స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. సగటుకు 1 డిగ్రీ నుంచి రెండు డిగ్రీల వరకు అధికంగా కొనసాగుతున్నప్పటికీ రానున్న రెండు, మూడు రోజుల్లో గాలుల దిశ, వాతావరణ పరిస్థితుల వల్ల స్వల్పంగా చల్లబడే అవకాశాలు కనిపిస్తున్నాయి. పసిఫిక్ మహాసముద్రంలోని జలాల ఉష్ణోగ్రతలు 0.5 డిగ్రీలు పెరిగినట్లయితే అది రుతుపవనాలపై ప్రభావం చూపిస్తుంది. ముఖ్యంగా భూమధ్య రేఖకు(ఈక్వేటర్) అనుకుని 5 డిగ్రీ ఉత్తర, 5 దక్షిణ మధ్యలో ఉన్న పసిఫిక్ జలాల ఉష్ణోగ్రతల్లో పెరిగుదల కనిపించినట్లయితే దానిని ఎల్?నినో అంటారు. ఎల్?నినో కారణంగా రుతుపవనాలు ఆలస్యం కావడం, వర్షాలు పడక పోవడం లాంటి ప్రతికూల పరిస్థితులు ఉంటాయి.

# అనధికార లేఅవుట్లలోని ప్లాట్ల క్రమబద్ధీకరణ

-మొదటిపేజీ తరువాయి

ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల్లు అయ్యాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది జూన్ నాటికి గడువు ముగియగా ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల ద్వారా దాదాపు రెండున్నర వేల కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2020-భూముల క్రమబద్ధీకరణ-లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ దరఖాస్తులను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి రాయితీ గడువు పొడిగించింది. 2020 ఆగస్టు 31 నుంచి అక్టోబర్ 31 వరకు రెండు నెలలపాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్వీకరించిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు మాత్రమే క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించింది. రాష్ట్రంలోని పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల నుంచి దాదాపు 25.44 లక్షల మంది ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో కార్పొరేషన్ల పరిధిలో 4.13 లక్షలు, మున్సిపాలిటీల పరిధిలో 10.54 లక్షలు, పంచాయతీల్లో 10.76 లక్షలు లెక్కన దరఖాస్తులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దేవాదాయ, వక్ఫ్, ప్రభుత్వ భూములు, కోర్టు ఆదేశాలు ఉన్న భూములు మినహా ఇతర లే-అవుట్ లను క్రమబద్ధీకరించాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఎల్ఆర్ఎస్ ఫీజులో 25 శాతం రాయితీ కల్పించింది. ఆయా ప్రాంతాల్లో ప్లాట్ల మార్కెట్ ధరపై 14శాతం ఓపెన్ స్పేస్ ఛార్జీలు, మరో 1.5 శాతం పీనల్ రుసుములతో మొత్తం కలిపి స్థానిక రిజిస్ట్రేషన్ మార్కెట్ విలువపై 15.5శాతం రెగ్యులరైజేషన్ ఫీజు కింద చెల్లించాల్సి ఉంటుంది.

**మరో 5 లక్షలకుపైగా దరఖాస్తులు**

గత ఏడాది జూన్ చివర వరకు అనధికారిక ఓపెన్ ప్లాట్లు క్రమబద్ధీకరణ చేసుకునే వారికి ఫీజులో 25శాతం ప్రభుత్వం రాయితీ కల్పించింది. అప్పట్లో అర్హమైనవిగా గుర్తించిన అధికారులు 20,42,944 దరఖాస్తుదారులకు ఫీజు చెల్లించేందుకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. మరో 5 లక్షలకుపైగా దరఖాస్తులు వివిధ కారణాలతో తిరస్కరించారు. ఇప్పటి వరకు 5,92,649 దరఖాస్తుదారులు 25 శాతం రాయితీ కింద ఫీజు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రెవెన్యూ, మున్సిపల్, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా పరిశీలన చేసి క్లియరెన్స్ ఇస్తే ప్రొసీడింగ్స్ పూర్తయినట్లు భావించి మున్సిపల్ శాఖ అధికారులు ప్రొసీడింగ్స్ ఇస్తారు. అయితే ఇప్పటి వరకు 1,99,430 దరఖాస్తుదారులకు మాత్రమే ప్రొసీడింగ్స్ ఇచ్చినట్లు అధికారిక గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల్లు ద్వారా అప్పట్లో దాదాపు రెండున్నర వేల కోట్లు ఆదాయం రాగా, మరో రూ.500 కోట్లు ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల్లు ద్వారా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం వచ్చినట్లు అధికార వర్గాలు చెబుతున్నారు. గత ఏడాది జూన్‌తో ముగిసిన గడువును తిరిగి ఈ ఏడాది మే నుంచి జూలై వరకు 25శాతం రాయితీతో ఎల్ఆర్ఎస్ రిజిస్ట్రేషన్ల్లు చేసుకునేందుకు ఇచ్చిన గడువు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏకంగా మూడు నెలలపాటు గడువు ఇవ్వడంతో మిగిలిన దరఖాస్తుదారులు అంతా ఎల్ఆర్ఎస్ చేసుకోడానికి ముందుకు వస్తారని ప్రభుత్వ అధికారులు అంచనా వేస్తున్నారు.

# జయమ్మ బాటలో కవితమ్మ...

**నిజామాబాద్ :** మనసులో మాట.. అంటూ కొత్తగా తెలంగాణ రాష్ట్ర సేన(టీఆర్ఎస్) పార్టీని ప్రారంభించిన కవిత కీలక ప్రకటన చేశారు. అదే 'తెలంగాణ తల్లి'గా తాను ఉండాలని భావిస్తున్నట్టు చెప్పుకొచ్చారు. సహజంగా ఇది తమిళనాడులో మాత్రమే చెల్లింది. అక్కడ ఉమ్మడి పార్టీ అంటే ద్రవిడ పార్టీ నుంచి అన్న డీఎంకే విడిపోయినప్పుడు.. ఎంజీఆర్ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన జయలలిత(జయమ్మ) తనకంటూ ఒక సొంత కుంపటిని ఏర్పాటు చేసుకునే క్రమంలో తమిళ ప్రజలకు తల్లిగా పరిచయమయ్యారు.ఇలాగే ఆవిడ కూడా తనను తల్లిగా భావించాలని కోరుకున్నారు. తమిళనాడు ప్రజలు ఆమెను రిసీవ్ చేసుకున్నారు. దీనికి కారణం ఏంటంటే.. ఆవిడ నటిగా తమిళ ప్రజల గుండెల్లో ఉన్నారు కాబట్టి అది సాధ్యమైంది. అప్పటికే వందలాది సినిమాల్లో ఆమె నటించారు. తమిళ ప్రజలను ఆకట్టుకున్నారు. కాబట్టి ఆమెను తల్లిగా భావించారు. అది సక్సెస్ అయింది. ఇప్పటికీ జయలలిత విగ్రహాలతో ఆలయాలు కట్టిన గ్రామాలు కూడా ఉన్నాయి తమిళనాడులో. కానీ ఆ పరిస్థితి కవితకు వస్తుందా.. ఆమె కామె అనుకుంటే తల్లిగా రిసీవ్ అవుతారా.. అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తెలంగాణ సమాజం ఒక విభిన్నమైన ఆలోచనతో ఉంటుంది. సెంటిమెంటు అంటే అది వ్యక్తిగత సెంటిమెంటు కంటే కూడా సమాజ సెంటిమెంటుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే ప్రజలు తెలంగాణలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో జరిగిన ఒక ఘటనను తీసుకుంటే.. కేసీఆర్ ఆమరణ దీక్ష ప్రారంభించారుఇంతలో ఢిల్లీ నుంచి వచ్చిన సమాచారంతో ఆయన దీక్ష విరమణ చేస్తున్నట్టు ప్రకటించారు. తెలంగాణ సమాజం తిరగబడే పరిస్థితి వచ్చింది. ఇంక తప్పని పరిస్థితుల్లో కేసీఆర్ దీక్షను కొనసాగించారు. అటువంటి సెంటిమెంటు ఉన్న తెలంగాణలో 'నేను అమ్మ'ని అని పరిచయం చేసుకోవడం వరకు బాగానే ఉన్నప్పటికీ తెలంగాణ సమాజం ఏ మేరకు దీన్ని ఆహ్వానిస్తుంది అనేది ప్రశ్న. ఇప్పటివరకు కవిత అంటే కెసిఆర్ కుమార్తె గానే చూశారు. ఒక ఎంపీగా ఒక ఎమ్మెల్సీగా ఒక రాజకీయ నాయకురాలుగా ఒక జాగృతి అధ్యక్షురాలుగా చూశారే తప్ప అకస్మాత్తుగా 'నేను అమ్మ'ని అని ఆవిడ చెప్పినంత మాత్రాన తెలంగాణ సమాజం ఆ రకంగా రిసీవ్ చేసుకోవడం కష్ట సాధ్యం. అంతేకాదు ఆవిడ చెప్పినంత తేలికగా తెలంగాణ సమాజం కవితను అమ్మగా చూసే పరిస్థితి కూడా ఉండదు. ఎవరికి ఉండే అంచనాలు వారికి ఉంటాయి తప్పేమీ కాదు. కానీ.. ఎక్కువగా ఊహించుకుంటేనే ప్రమాదం. ఈ విషయంలో కవిత ఆలోచించుకుని అడుగులు వేయడం ఉత్తమమని పరిశీలకులు చెబుతున్నారు.

# కరీంనగర్ లో కయ్యాల కాంగ్రెస్

**కరీంనగర్ :** కాంగ్రెస్ అంటేనే కయ్యాల పార్టీ. తెలుగు రాష్ట్రాల్లో అయితే మరీ ఎక్కువ. ఒక నేత ఎదుగుదలను మరో నేత ఓర్వలేడు. ఒకరి ఆధిపత్యాన్ని మరోకరు సహించరు. ఎవరికి వారు గ్రూపులుగా ఉంటారు. అవసరమైతే అధిష్టానాన్ని కూడా బూతులు తిడతారు. తర్వాత కలిసే ఉంటారు. ఏమన్నా అంటే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అని పెద్దపెద్ద మాటలు చెబుతారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన హస్తం పార్టీలో కొన్నాళ్ల కయ్యాలు కనిపించలేదు. కానీ ఆరు నెలలుగా లుకలుకలు బయటపడుతున్నాయి. తాజాగా కరీనంగర్‌లో బిభేదాలు రచ్చకెక్కాయి. కరీంనగర్ కాంగ్రెస్‌లో ఇన్‌చార్జి నియామకం వివాదం పార్టీ ఐక్యతను దెబ్బతీసింది. స్థానిక నేతల అసంతృప్తి, అధిష్ఠాన నిర్ణయాలపై బహిరంగ తిరస్కారం శ్రేణుల్లో గందరగోళాన్ని మురికి చేస్తోంది.వెలిచాల్ రాజేందర్ రావును కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడం పలువురు స్థానిక నాయకుల అభ్యంతరానికి దారితీసింది. సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు తమ పేర్లతో వినతిపత్రాలు సమర్పించారని, తమ సమ్మతి లేకుండానే జరిగిందని మండిపడ్డారు. సన్నాహక సమావేశాల్లోనే విభేదాలు బహిర్గతమై, గొడవల వరకు



వెళ్లింది.మాజీ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్‌లాంటి మునుపటి నాయకులు పార్టీ నాయకత్వంపై ఫైర్ అవుతున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల్ రాజేందర్ రావును లక్ష్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల్లో సహకారం లేకపోవడం, టికెట్ కేటాయింపుల్లో భేదం వంటి ఆరోపణలు ఉన్నాయి. డీసీసీ కార్యాలయంలో రహస్య సమావేశాల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.కరీంనగర్ కాంగ్రెస్‌లో మూడు ముక్కలాట జరుగుతోంది. గత మున్సిపల్ మున్సిపల్ ఎన్నికల్లో 66 డివిజన్లలో కేవలం 14 సీట్లకే పరిమితమైంది. ఇన్‌చార్జి లేకపోవడం, జిల్లా అధ్యక్ష పదవి ఆలస్యం ఈ సమస్యలకు ఆధారం. మంత్రివర్గ విస్తరణలో కూడా స్థానికులకు ప్రాధాన్యత లేకపోవడంపై నిరాశ వ్యక్తమవుతున్నారు. ఈ వివాదం పీసీసీ స్థాయికి చేరి, సస్పెన్షన్ డిమాండ్లు ఉయరుతున్నాయి. ఎన్నికల విషయాల్లో పార్టీ బలం తగ్గుతున్న ఈ ప్రాంతంలో ఇది మరింత దెబ్బ తీస్తుంది.అధిష్టానం త్వరగా స్థానిక నేతలతో సమావేశాలు నిర్వహించి, పునర్నియామకాలు చేయాలి. పారదర్శకత, స్థానిక ప్రాతినిధ్యం పెంచితే శ్రేణులు ఏకతాటిపై నడవవచ్చు. లేకపోతే రాబోయే ఎన్నికల్లో మూడో స్థానానికి మాత్రమే పరిమితమవుతుంది.

## కవిత పార్టీ 'తెలంగాణ రక్షణ సేన'కు ఈసీ గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

పేరును ఈసీ ఆమోదం తెలిపింది. టీఆర్ఎస్ పార్టీకి అనుమతిస్తూ బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో ఎన్నికల సంఘం అధికారులు లేఖ అందజేశారు. ఆరంభంలో తెలంగాణ ప్రజా జాగృతి, తెలంగాణ జాగృతి, తెలంగాణ రక్షణ సేన, తెలంగాణ రాష్ట్ర జాగృతి, తెలంగాణ ప్రజాశక్తి తదితర పేర్లలో ఒక పేరుతో రాజకీయ పార్టీ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరారు.

**తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తా**

తెలంగాణ రక్షణ సేన పేరుకు ఈసీ ఆమోదంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్‌కు ఈసీ ఆమోదం తెలిపిందని ఎక్స్ వేదిగా తెలిపారు. సమస్త తెలంగాణ సమాజానికి తెలియచేయడానికి సంతోషిస్తున్నానని, జనవరిలో ఈసీ నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేశామని అన్నారు. మొత్తం ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నామని, మూడో ప్రాధాన్యతగా ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించిందని వెల్లడించారు. టీఆర్ఎస్ తనకు రాసిపెట్టి ఉందేమో అని తెలిపారు. రెండు దశాబ్దాలుగా చేస్తున్న కృషిని కొనసాగిస్తానని, తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా పని చేస్తానని స్పష్టం చేశారు.

**అభ్యంతరాలు ఉంటే తెలపవచ్చు**

కొత్త పార్టీ పేరు అంశంలో కల్వకుంట్ల కవితకు ఈసీ లేఖ రాసింది. తెలంగాణ రక్షణ సేన పేరును ప్రాథమికంగా ఈసీ ఖరారు చేసింది. పార్టీ పేరుపై రెండు జాతీయ, రెండు స్థానిక పత్రికల్లో ప్రకటన ఇవ్వాలని ఈసీ సూచించింది. కొత్త పార్టీ పేరుపై అభ్యంతరాలుంటే తెలపాలన్న ఎన్నికల సంఘం 30 రోజుల్లోపు అభ్యంతరాలను తెలపాలని పేర్కొంది. అభ్యంతరాల పరిశీలన తర్వాత పార్టీ పేరు ఖరారు చేస్తామని ఈసీ ప్రకటించింది. "తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)కు కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం తెలిపిందని సమస్త తెలంగాణ సమాజానికి తెలియ చేయడానికి సంతోషిస్తున్నాము. రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక పరిరక్షణ, పునరుజ్జీవం కోసం నేను చేసిన కృషిని కొనసాగిస్తూ, ఇక ముందు కూడా తెలంగాణ అస్తిత్వ పరిరక్షణే ధ్యేయంగా అంకితభావంతో పని చేస్తానని తెలియజేస్తున్నాను. జనవరి 2026 లో జాతీయ ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఐదు పేర్లతో దరఖాస్తు చేసుకున్నాం. అందులో మూడో ప్రాధాన్యతగా మేము ఇచ్చిన పేరును ఈసీ ఆమోదించడం కేవలం యాదృచ్ఛికం. ౦=హా నాకు రాసిపెట్టి ఉందేమో!!"

**తెలంగాణ రాష్ట్ర సేనగా కవిత ప్రకటన**

ఈ నెల 25న మేడ్చల్ జిల్లా మునీరాబాద్ వేదికగా కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ పెద్ద ఎత్తున ప్రకటించారు. పార్టీకి 'తెలంగాణ రాష్ట్ర సేన'గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్రం కోసం అనేక కష్టాలు పడి పిడికిలి బిగించి కొట్లాడామని తెలిపారు. జాగృతి కార్యకర్తలు తెలంగాణ సాంస్కృతిక దీపాన్ని పదిలంగా కాపాడుకున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్రంలో హిట్లర్ పాలన సాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కలిసి రాష్ట్ర ప్రజలను దోచుకుంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ తెలంగాణ ఆత్మ కోల్పోయినందుకే టీఆర్ఎస్ వచ్చిందని స్పష్టం చేశారు.

## 32 ఏళ్ల పోలీసు కెరీర్‌లో ఎన్నో అనుభవాలు, జ్ఞాపకాలు

-మొదటిపేజీ తరువాయి

అన్నారు. పోలీస్, ప్రజల మధ్య దూరం తగ్గించేందుకు ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని రాష్ట్రంలో అమలు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా పోలీసింగ్ చేపట్టినట్లుగా తెలిపారు. డీజీపీగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. యువ పోలీస్ అధికారులు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్?కు శివధర్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. "32 ఏళ్ల సుదీర్ఘ పోలీస్ జీవితంలో ఎన్నో అనుభవాలు, ఎన్నో జ్ఞాపకాలు, తీపిగుర్తులు, ఒత్తిడిలు. అన్నింట్లోనూ నాతో ముందుడి, పక్కనుంచి నడిపించి వెన్నుతట్టి నడిపినటువంటి సీనియర్స్‌కు ధన్యవాదాలు. వారు చూపించిన పథంలోనే పోలీస్‌శాఖ నడుస్తుందని భావిస్తున్నాను. ఒకప్పటితో పోలిస్తే పోలీసింగ్‌లో ఎన్నో మార్పులు వచ్చాయి"

**ఎన్నో విశిష్ట సేవలందించారు**

పదవీ విరమణ పొందుతున్న డీజీపీ శివధర్‌రెడ్డికి, నూతన డీజీపీగా నియమితులైన సీవీ ఆనంద్ అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 32 ఏళ్లపాటు శివధర్‌రెడ్డి ప్రజలకు ఎన్నో విశిష్ట సేవలు అందించారని కొనియాడారు. నక్సలిజం ప్రభావిత ప్రాంతాల్లో కీలకంగా పని చేశారని, ఎన్‌కౌంటర్లు, మావోయిస్టుల సరెండర్‌లోనూ ఆయన కీలక పాత్ర పోషించారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్‌ను విజయవంతంగా అమలు చేసినట్లుగా వివరించారు."భారీగా మావోయిస్టుల ఆయుధాల స్వాధీనం, లొంగుబాటు సాధన కోసం శివధర్ రెడ్డి కృషి చేశారని సీవీ ఆనంద్ అన్నారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటం పోలీసు బాధ్యతగా పేర్కొన్నారని గుర్తుచేశారు. 2016 నుంచి కలిసి పలువురు అధికారులతో కలిసి పని చేశానన్నారు. వారి సూచనలను స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానని అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

**రాష్ట్ర భద్రతా సలహాదారుగా శివధర్ రెడ్డి**

పదవీ విరమణ అనంతరం తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారు(స్టేట్ సెక్యూరిటీ అడ్వైజర్ ఫర్ తెలంగాణ)గా శివధర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హోదాతో కూడిన ఈ పదవిలో ఆయన మూడేళ్ల పాటు పనిచేయనున్నారు.

ఇదీ శివధర్ రెడ్డి నేపథ్యం : రంగారెడ్డి జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్‌కు చెందిన శివధర్ రెడ్డి 1994 ఐపీఎస్ బ్యాచ్ ద్వారా ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏఎస్పీగా, అదనపు ఎస్పీగా, ఎస్పీగా పలు జిల్లాల్లో విధులు నిర్వర్తించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఆయన ఇంటెలిజెన్స్ చీఫ్ బాధ్యతల్ని స్వీకరించారు. అనంతరం పర్సనల్ విభాగంలో ఐజీపీగా నియమితులై అక్కడే అదనపు డీజీపీగా ప్రమోషన్? పొందారు. రోడ్డు భద్రతా విభాగం అదనపు డీజీపీగానూ విధులు నిర్వర్తించారు. 2023 డిసెంబరులో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన అనంతరం మళ్లీ ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమితులయ్యారు. గతేడాది అక్టోబరులో ఆయనను డీజీపీగా నియమించారు.

## కాళేశ్వరంపై రేవంత్ మార్క్ యుద్ధం

-మొదటిపేజీ తరువాయి

బదులుగా, గతంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇచ్చిన ప్రాథమిక నివేదికలను, ప్రాజెక్టులో జరిగిన నిధుల మళ్లింపు ఆరోపణలను ప్రధాన ప్రాతిపదికగా చూపారు. 9 నెలల కిందటే పంపిన ఈ సిఫారసు ద్వారా సీబీఐ రంగప్రవేశానికి ఉన్న సాంకేతిక అడ్డంకులను ప్రభుత్వం తొలగించింది. వ్యవస్థాగతమైన దర్యాప్తు ద్వారా బాధ్యులను బోనులో నిలబెట్టడమే లక్ష్యంగా అడుగులు వేస్తోంది.రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా బీఆర్ఎస్ అగ్రనేతలపై చర్యలకు ఉపక్రమిస్తే, అది రాజకీయంగా కక్షసాధింపు అనే ముద్ర పడి సానుభూతిని తెచ్చిపెట్టే అవకాశం ఉందని రేవంత్ భావిస్తున్నారు. అందుకే ఈ బంతిని కేంద్రం కోర్టులోకి విసిరారు. వేల కోట్ల ప్రజాధనం వృథా అయిన ఈ కుంభకోణంపై కేంద్రమే విచారణ జరిపించాలని కోరడం ద్వారా బీజేపీ చిత్తశుద్ధిని రేవంత్ పరీక్షకు పెట్టారు. ఒకవేళ కేంద్రం సీబీఐ విచారణకు వెనుకాడుతే, "మోదీ-కేసీఆర్ ఒక్కటే" అనే ప్రచారాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, బీజేపీని డిఫెన్స్‌లో పడేయాలన్నది కాంగ్రెస్ వ్యూహం. సీబీఐ దర్యాప్తునకు పచ్చజెండా ఊపితే ఆ క్రెడిట్ రేవంత్ ఖాతాలోకి వెళ్తుంది. ఒకవేళ మౌనంగా ఉంటే బీఆర్ఎస్‌ను కాపాడుతున్నారన్న విమర్శలు వస్తాయి.కేవలం లేఖలతోనే సరిపెట్టకుండా, రేవంత్ రెడ్డి స్వయంగా సీబీఐ డైరెక్టర్‌ను కలవాలని లేదా మంత్రుల బృందాన్ని ఢిల్లీకి పంపాలని నిశ్చయించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన ప్రాథమిక ఆధారాలను స్వయంగా అందజేయడం ద్వారా దర్యాప్తును అనివార్యం చేయాలన్నది వారి ప్లాన్. విచారణ జరిగినా, జరగకపోయినా.. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందవచ్చని, ప్రజాధనం విషయంలో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవచ్చని రేవంత్ సర్కార్ బలంగా నమ్ముతోంది. ఒకవేళ విచారణ ప్రారంభమై కేసీఆర్ కుటుంబం చుట్టూ ఉచ్చు బిగిస్తే, తెలంగాణ రాజకీయాల్లో మునుపెన్నడూ లేని విధంగా పెను మార్పులు సంభవించడం ఖాయం. రేవంత్ రెడ్డి పన్నిన ఈ చక్రవ్యూహం నుండి ప్రత్యర్థులు ఎలా బయటపడతారో వేచి చూడాలి.

తీన్మార్

# బ్యాలెట్ బాక్సుల్లో భవితవ్యం

ప్రజాస్వామ్య భారత్‌లో ఎన్నికలు అంటే కేవలం ఓట్లు వేయడం మాత్రమే కాదు. ఆ ఓటు ఫలితం ఏంటో తెలుసుకోవాలని ఉత్సుకత ప్రతి ఒక్కరిలో ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ప్రజల నాడిని పట్టుకోవాలని ప్రయత్నించే చర్య సర్వేలు. ప్రస్తుతం 2026లో ఐదు రాష్ట్రాల్లో జరిగిన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ కూడా వచ్చాయి. అయితే ఈ సర్వేలు ఎలా చేస్తారు. వీటికి ఉండే చట్టబద్ధత ఏంటీ అనే విషయాలను లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఒపీనియర్ పోల్ లేదా అభిప్రాయ సేకరణ అనేది ఎన్నికలు ప్రారంభంకావడానికి ముందే నిర్వహించే సర్వే. నామినేషన్ల ప్రక్రియకు ముందు లేదా ప్రచారం జరుగుతున్న సమయంలో వీటిని చేపడతారు. ఓటర్లు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు, వారి ప్రధాన సమస్యలు ఏంటీ, ప్రచార పద్ధతులు ఓటర్లను ఎంత వరకు ప్రభావితం చేస్తున్నాయి అనేది తెలుసుకోవడానికి సర్వేలు చేస్తారు. శాంపిల్ సైజ్ నుంచి సమాచారాన్ని సేకరిస్తారు. ఎన్నికల ప్రచారం సాగుతున్న కొద్దీ ప్రజల అభిప్రాయాలు మారే ఛాన్స్ ఉంది. అందుకే ఒపీనియన్ పోల్ ఫలితాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ఎగ్జిట్ పోల్ అనేది ఓటు వేసిన తర్వాత బయటకు వచ్చిన ఓటరు అభిప్రాయాన్ని నేరుగా సేకరించే ప్రక్రియ. ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే పోలింగ్ కేంద్రం వెలుపల ఈ సర్వే చేస్తారు. సర్వే చేసే వ్యక్తులు పోలింగ్ బూత్ బయట వేచి ఉండి, ఓటు వేసి వస్తున్న వారిని మీరు ఎవరికి ఓటు వేశారు అని అడిగి తెలుసుకుంటారు. ఓటరు తన నిర్ణయాన్ని అమలు చేసిన తర్వాత చెప్పే మాటలు కాబట్టి ఇవి ఒపీనియన్ పోల్స్ కంటే కాస్త కచ్చితత్వానికి దగ్గరగా ఉంటాయని భావిస్తున్నారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక అంచనాలు మాత్రమే. అధికారిక ఫలితాలు కావు. ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా జరగడానికి కేంద్ర ఎన్నికల సంఘం కొన్ని రూల్స్ ఫ్రేమ్ చేసింది. ముఖ్యంగా ఎగ్జిట్ పోల్స్ ప్రసారంపై ఆంక్షలు విధించింది. ఎన్నికలు ఒకటి కంటే ఎక్కువ దశల్లో జరుగుతున్నప్పుడు అన్ని దశల పోలింగ్ పూర్తి అయ్యే వరకు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలు వెల్లడించకూడదు. ఇవాళ కూడా దీన్ని అమలు చేసింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమై ఆరు గంటలకు ముగిసింది. ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఆరున్న తర్వాత వెల్లడించారు. ఈ రూల్స్ అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారు. రెండేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ ఉంటాయి. మీడియా సంస్థలు, పరిశోధన ఏజెన్సీలు, పోలింగ్ సంస్థలు వివిధ పద్ధతుల ద్వారా డేటాను సేకరిస్తాయి. క్షేత్రస్థాయిలో ఓటర్లతో మాట్లాడటం ద్వారా, టెలీఫోన్ ద్వారా ఓటర్ల అభిప్రాయం తెలుసుకుంటాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో టీంలను పంపించి సమాచారాన్ని సేకరిస్తారు. మరో వైపు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో దాదాపు అన్ని సర్వేలు డీఎంకే కూటమిదే మళ్లీ అధికారమని అంచనా వేశాయి. కానీ, ఒక్క సంస్థ మాత్రం దళపతి విజయ్ పార్టీ టీవీకే మెజార్టీ స్థానాల్లో గెలిచి, అధికారం చేపడుతుందని తెలిపింది. యాక్సిస్ మై ఇండియా సర్వే విజయ్ పార్టీ సునామీ తథ్యమని జోస్యం చెప్పింది. ఆ సంస్థ అంచనా ప్రకారం టీవీకే 98 నుంచి 120 స్థానాలు, డీఎంకే కూటమి 92 నుంచి 110, అన్నాడీఎంకే కూటమి 22 నుంచి 30 సీట్లలో గెలుస్తుందని పేర్కొంది. మొత్తం 234 స్థానాలున్న తమిళనాడులో అధికారం చేపట్టడానికి మ్యాజిక్ ఫిగర్ 118 స్థానాలు. ఆ సర్వే అంచనా నిజమైతే విజయ్ ముఖ్యమంత్రి అవుతారు. అయితే, తుది ఫలితాలు అంచనాలకు దగ్గరగా ఉంటాయా? లేదా? అనేది మే 4న తేలిపోనుంది. అంతేకాదు, అంచనాలు తారుమారై డీఎంకే కూటమి మెజార్టీ మార్క్‌కు దగ్గరగా ఆగిపోతే విజయ్ మద్దతు కీలకమవుతుంది. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.అయితే, గతంలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికల్లో యాక్సిస్ మై ఇండియా సర్వేలు నిజమయ్యాయి. గతంలో ఐదు సందర్భాల్లో మిగతా సంస్థలకు భిన్నంగా దీని అంచనాలు, ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే కూటమికి 359 సీట్లు వస్తాయని అంచనా వేసింది. ఈ అంచనాలకు అనుగుణంగా ఫలితాలు వచ్చాయి. 2024లో మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు, గతేడాది ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు, అంతకు ముందు మధ్యప్రదేశ్ శాసనసభ ఎన్నికల సమయంలోనూ ఖచ్చితంగా అంచనా వేసింది. మధ్యప్రదేశ్‌లో అన్ని సర్వేలూ కాంగ్రెస్ గెలుస్తుందని చెబితే.. యాక్సిస్ మై ఇండియా మాత్రం 140- 162 సీట్లు వస్తాయని జోస్యం చెప్పింది. అన్నట్టుగానే బీజేపీ 163 సీట్లతో మళ్లీ అధికారం నిలబెట్టుకుంది.ఎగ్జిట్ పోల్స్ ఎప్పుడూ ఓట్ల లెక్కింపు రోజున వాస్తవ ఫలితాలుగా మారనప్పటికీ, అవి ప్రజా చర్చను ప్రభావితం చేస్తూ, తుది తీర్పుపై ఉత్కంఠను పెంచుతాయి. ఇక బెంగాల్ విషయానికి వస్తే పీపుల్స్ పల్స్ సర్వే టీఎంసీకి 177 నుంచి 187, బీజేపీకి 95-110 స్థానాలు వస్తాయని అంచనా వేసింది. మ్యాట్రిజ్ సర్వే టీఎంసీ 125 నుంచి 140, బీజేపీ 146-161 చోట్ల విజయం సాధిస్తుందని పేర్కొంది. అయితే, పీ-మార్క్ సర్వే మాత్రం టీఎంసీ 118-138, బీజేపీ 150-175 స్థానాల్లో గెలిచే అవకాశం ఉందని పేర్కొంది. చాణక్య స్ట్రాటజీస్ కూడా బీజేపీకి ఛాన్స్ ఉందని వెల్లడించింది. బీజేపీకి 150-160 స్థానాలు, తృణమూల్ కాంగ్రెస్‌కు 130-140 స్థానాలు వచ్చే ఛాన్స్ ఉందని తెలిపింది. పోల్ డెయిరీ కూడా కమలం వికసిస్తుందని అంచనా వేసింది. టీఎంసీకి 99 నుంచి 127, బీజేపీకి 142 నుంచి 171, కాంగ్రెస్ 3 నుంచి 5 స్థానాల్లో విజయం సాధిస్తాయని చెప్పింది. జన్మత్ 195 నుంచి 205 స్థానాలు టీఎంసీకి, 80 నుంచి 90 స్థానాలు బీజేపీకి వస్తాయని అంచనా వేసింది. అలాగే, ఎన్డీటీవీ అంచనాలు కూడా టీఎంసీ 146, బీజేపీ 140, ఇతరులు 6 చోట్ల విజయం సాధించే అవకాశం ఉన్నాయని తెలిపాయి.మరి ఈసారి కూడా ఈ సంస్థ అంచనాలు నిజమవుతాయా? అనేది మే 4న తెలుస్తుంది. తమిళనాడు ఎన్నికల్లో తొలిసారి పోటీచేసిన విజయ్.. ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదు. ఈ సర్వే అంచనా వేసినట్టు ఫలితాలు ఉంటే.. విజయ్ చరిత్రను తిరగరాయనున్నారు.ఇప్పుడు ఎగ్జిట్ పోల్స్ ఇస్తున్న సంస్థలు పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరిలో ఓటింగ్ సరళిని అంచనా వేయడానికి ఈ పద్ధతులను అనుసరించాయి. ఎగ్జిట్ పోల్స్ అనేవి కేవలం సంకేతాలు మాత్రమే ఇవి ఎప్పుడూ కచ్చితంగా ఉంటాయని చెప్పలేం. అనేక సందర్భాల్లో ఎగ్జిట్‌పోల్ అంచనాలు లెక్క తప్పుతుంటాయి. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల్లో ఒకట్రెండు మినహా మిగతా సర్వే సంస్థల లెక్కలు తెప్పాయి.

# కాలం తీరిన కాంగ్రెస్



సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ అంటే సింహస్వప్నంలా ఉంటుందేమో. నుడుగుకి నూరుసార్లు 'మాయమై పో' అని పిడుగు మంత్రాలు చదువుతుంటారు. ఇంకా అమానుషమైన రీతిలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సంధిప్రేలాపనలు పేలుతుంటారు. చావుకోరే మాటలతో వైరభక్తి ప్రదర్శిస్తుంటారు. 'గుర్తులు' చెరిపేస్తా అని అక్కసుతో తిక్కరాజకీయాలు చేసి భంగపడుతుంటారు. పదవి చేపట్టి రెండున్నరేండ్లయినా ఇప్పటికీ తాను సీఎంననే భావన ఆయనలో ఎందువల్లనో పాదుకోలేకపోతున్నది. బీఆర్ఎస్ అస్తిత్వ, ప్రాభవాలు ఆయనకు కునుకు లేకుండా చేస్తున్నాయనేది అనునిత్యం ఆయన చేస్తున్న వింత, వితండ వాదనలే తేటతెల్లం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్‌కు గతం తప్ప భవిష్యత్తు లేదని, ఆ పార్టీ కాలపరిమితి ముగిసిందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వాక్రుచ్చిన ఆణిముత్యాలు నవ్వు తెప్పించకమానవు. ఇటు చేతకాని, చేవలేని పాలనతో ప్రభుత్వంపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకత, అటు పాలకపక్షం నుంచి జీవన్‌రెడ్డి వంటి సీనియర్ల చేరికతో బీఆర్ఎస్‌కు పెరుగుతున్న ప్రజా మద్దతుతో అసహనానికి గురై ఇలాంటి అపహాస్యపు వ్యాఖ్యలు చేస్తున్నారని అనుకోవాల్సి ఉంటుంది. బీఆర్ఎస్‌కు కాలం చెల్లింది అనడంలో బహుశా రేవంత్ ఉద్దేశం ఏమై ఉంటుందోనని ఆలోచిస్తే మనకు వెంటనే స్ఫురించేది తెలంగాణ సాధన. తెలంగాణ కోసం కొట్లాడింది బీఆర్ఎస్. అందుకు ప్రతిఫలంగా స్వరాష్ట్రం సిద్ధించింది. ఇంక ఆ పార్టీ అవసరం లేదన్నది రేవంత్ భావమేమో. కానీ ఈ దిశగా ఆలోచన చేయడం ద్వారా ఆయన రెండు విధాలుగా సెల్ఫ్ గోల్ చేసుకున్నారని అనిపిస్తున్నది. ఒకటి.. తెలంగాణ సాధించి ఆపై కాడి పడేస్తానని బీఆర్ఎస్ ఏనాడూ చెప్పలేదు. బంగారు తెలంగాణ సాధనకు నూరుశాతం కట్టుబడిన పార్టీ బీఆర్ఎస్. అందుకు కేసీఆర్ తన రెండు విడతల పాలనాకాలంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టి, అమలు చేసి విజయం సాధించారు. తద్వారా నవజాత రాష్ట్రానికి దేశవిదేశాల్లో కీర్తిప్రతిష్ఠలు ఆర్జించి పెట్టారు. ఓట్ల శాతంలో చిన్న తేడాతో రేవంత్ సీఎంగా గద్దె ఎక్కడానికి కేసీఆర్ సాధించిన తెలంగాణ రాష్ట్రమే ఆధారమైంది. అందుకు సీఎం తెలంగాణ సాధకుడికి సదా రుణపడి ఉండాలి. రెండు.. కాలం తీరడం విషయానికి వస్తే అందుకు కాంగ్రెస్ పార్టీయే అన్నివిధాలుగా సరైన ఎంపిక అవుతుంది. స్వాతంత్ర్య పోరాటకాలంలో వివిధ భావజాలాలు కలిగిన రాజకీయ శక్తులకు కాంగ్రెస్ ఒక వేదికలా, ఒక గొడుగునీడలా ఉండేది. అదొక రాజకీయ పార్టీ కాదు. మరోరకంగా చెప్పాలంటే రాజకీయ పార్టీల కూడలి. కాలక్రమంలో ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా లెఫ్ట్, రైట్ పార్టీలన్నీ సొంత కుంపట్లు పెట్టుకున్నాక స్వాతంత్ర్యం వచ్చింది. అప్పటికి కాంగ్రెస్ పేరుతో ఓ మధ్యేమార్గ వర్గం మిగిలిపోయింది. ఆ వర్గం కాంగ్రెస్ అనే పేరు వాడుకోవడంపై స్వాతంత్ర్య సమర సర్వోన్నత నేత అయిన బాపూజీ అయిష్టత తెలిపారు. కాంగ్రెస్‌ను రద్దు చేయాలని ఆయన బాహాటంగా పట్టుబట్టారు. కానీ అది జరుగలేదు. ఆ తర్వాతి కాలంలో ఎన్నో ముక్కచెక్కలై ఇప్పటి రూపంలో, అవసాన దశకు చేరింది కాంగ్రెస్ అనే కలగూరగంప. స్వాతంత్ర్య పోరాటం కాలం నాటి పేరుప్రతిష్ఠలపై వచ్చే వడ్డీతో బతుకుతున్న కాంగ్రెస్ దానంతట అదే రద్దు కాదు కనుక ప్రజలే ఆ పనికి పూనుకుంటున్నారు. చాలావరకు ఆ విషయంలో కృతకృత్యులయ్యారు కూడా. అంతా అనుకూలిస్తే రేవంత్‌రెడ్డి ఇంకో రెండేండ్లు పదవిలో ఉంటారు. ఈలోగా ఆయన చేయాల్సింది రాలుగాయి మాటలు మాని పరిపాలనపై శ్రద్ధ పెట్టడం. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నించడం. మోసకారి మాటలు, మాయదారి హామీలు ఇచ్చిన రేవంత్ ఆ పనిచేయలేరు. ప్రజలు ఆయన వ్యర్థపు మాటలతో విసిగిపోయారు. కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ చల్లని పాలనను పదేపదే తలపోస్తున్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ వైపు జీవన్‌రెడ్డి వంటి కాంగ్రెస్ సీనియర్ నేతలే మొగ్గుతున్నారు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్‌దే విజయమనే విశ్లేషణలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రేవంత్ ఉలికిపాటు మాటలు మాట్లాడకుండా హుందాగా వ్యవహరిస్తే బాగుంటుందని చెప్పకతప్పదు.

# ముగిసిన ఎన్నికల రణం




తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అస్సాంలతోపాటు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఏప్రిల్‌లో ఎన్నికలుంటాయని గత నెల 16న ఎన్నికల సంఘం(ఈసీ) ప్రకటించింది మొదలు అలుముకున్న ఒక రకమైన యుద్ధ వాతావరణం పరిసమాప్తమైంది. పశ్చిమ బెంగాల్‌లో బుధవారం ముగిసిన రెండో దశ పోలింగ్‌లో అనుకున్నట్టే భారీ స్థాయి ఓటింగ్ జరిగింది. సాయంత్రానికల్లా వెలువడిన ఎగ్జిట్ పోల్ ఫలితాలవరకూ చూస్తే దాదాపు అన్ని సర్వే సంస్థలూ కేరళలో కాంగ్రెస్ నాయకత్వంలోని యూడీఎఫ్, పుదుచ్చేరిలో ఎన్డీయే విజయం ఖాయమని తెలిపాయి. తమిళనాడులో కొత్త పార్టీ టీవీకే ప్రభావం ఎక్కువగా ఉందని చెబుతూనే డీఎంకే తిరిగి అధికారంలోకి రావటం ఖాయమని అయిదు సంస్థల్లో మూడు అంచనా వేయగా, ఒక సంస్థ అన్నాడీఎంకే--బీజేపీ కూటమివైపు మొగ్గింది. బెంగాల్‌లో తృణమూల్, బీజేపీలు హోరాహోరీగా తలపడ్డాయని సర్వేలు తేల్చాయి. ఆరు సంస్థల్లో రెండు తృణమూల్‌వైపు, మిగిలిన సంస్థలు బీజేపీవైపు మొగ్గాయి. వాస్తవ ఫలితాలకు ఇవి ఏమేరకు దగ్గరగా ఉంటాయన్నది వచ్చే నెల 4న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతగానీ తెలియదు. పోలింగ్ వరకూ చూస్తే మిగిలినచోట్ల దాదాపు ప్రశాంతంగానే ముగిసినా పశ్చిమ బెంగాల్ ఎప్పటిలాగే తనదైన ముద్ర మిగిల్చింది. రెండు దశల్లోనూ హింసాత్మక ఘటనలు తప్పలేదు. అయితే గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి జరిగిన హింస చాలా తక్కువని విశ్లేషకులు చెబుతున్నారు. కావొచ్చు... కానీ శాంతిభద్రతల పరిరక్షణ పేరుతో దాదాపు రెండున్నర లక్షలమంది బలగాలను మోహరించటం, ముఖ్యంగా రెండో దశ పోలింగ్ జరిగిన దక్షిణ బెంగాల్ ప్రాంతంలోని కొన్ని జిల్లాల్లో భద్రతా బలగాలు అతిగా ప్రవర్తించిన తీరు సబబు కాదు. ఒకరి హింసకు మరొకరి హింస ప్రత్యామ్నాయం కాదు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) పేరిట ఏకంగా 91 లక్షలమంది ఓటర్ల పేర్లు గల్లంతు కావటం, ఎక్కడెక్కడికో పనుల కోసం వలసపోయినవారు తిరిగొచ్చి కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా తగిన పత్రాలు సంపాదించలేకపోవటం, దాఖలు చేసినవారు సైతం భంగపడటం ఎందరినో కలవరపెట్టింది. చివరకు తొలి దశలో 139 మంది, మలి దశలో 1,468 మంది మాత్రమే న్యాయసమీక్షలో ఓటుహక్కు పొందారు. ఇక ఈసీ వివాదాస్పద పాత్ర సరేసరి. ముఖ్యంగా బెంగాల్‌లో ఎన్నికలు సక్రమంగా నిర్వహించటం కోసం తాను తటస్థంగా వ్యవహరించాలన్న సంగతిని అది మరిచింది. ఈ ఎన్నికల బరిలో తానూ ఉన్నానన్నట్టు వ్యవహరించింది. నిజానికి 2024 ఎన్నికల సమయంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఈ పోకడలు కనబడ్డాయి. అధికారుల బదిలీలు మొదలుకొని అనేక అంశాల్లో విపక్షం చెప్పినట్టల్లా ఈసీ ఆడిందని అప్పట్లోనే ఆరోపణలొచ్చాయి. ఇప్పుడు బెంగాల్‌లో అది మరింత బాహాటంగా జరిగింది. కేంద్ర పరిశీలకులుగా వచ్చిన ఒకరిద్దరు బెదిరింపు ధోర ణిలో మాట్లాడటం ఆశ్చర్యపరిచింది. అందులో 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్టు'గా మీడియా చెబుతున్న యూపీకి చెందిన ఒక సీనియర్ ఐపీఎస్ అధికారి కూడా ఉన్నారు. ఏ అభ్యర్థి అయినా సక్రమంగా వ్యవహరించకపోతే, డబ్బు పంచుతుంటే లేదా ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తుంటే చట్టం అనుమతించిన మేరకు కఠిన చర్యలు తీసుకోవాల్సిందే. కానీ బహిరంగ సవాళ్లు దేనికి? ఇది మంచి సందేశాన్ని పంపదు.

ఇతరచోట్ల గణనీయమైన విజయాలు సాధిస్తున్నా... బీజేపీకి మాతృసంస్థ అనదగ్గ జనసంఘ్‌కు నారూ నీరూ పోసిన స్వర్గీయ శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్వస్థలమైన బెంగాల్‌లో అది సాధించలేకపోతున్నామని మాజీ ప్రధాని స్వర్గీయ వాజ్‌పేయి ఒక దశలో ఆవేదన వ్యక్తం చేశారంటారు. ఆయన తొలినాళ్లలో ముఖర్జీకి వ్యక్తిగత సహాయకుడిగా పనిచేశారు. ప్రధాని నరేంద్ర మోదీ హయాంలోనైనా అదెంతవరకూ సాకారమవుతుందన్న విషయంలో ఎవరి అంచనాలు వారివి. 'స్ట్రీట్ ఫైటర్'గా పేరున్న ముఖ్యమంత్రి మమతకు దీటుగా నిలబడగల స్థానిక నాయకులు ఇంతవరకూ బీజేపీకి తారసపడలేదు. అందుకే ప్రచార బాధ్యతల్ని స్వయంగా నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలు మోయాల్సివచ్చింది. అక్కడొచ్చే ఫలితాలు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ పాలక, విపక్షాల వ్యూహాలపై రానున్న రోజుల్లో తీవ్ర ప్రభావం చూపగలవనటంలో సందేహం లేదు.

# బీజేపీని నిండా ముంచుతున్న అన్నాడీఎంకే

మిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై ని పక్కన పెట్టింది. ఏఐడీఎంకే చెప్పినట్టుగా సీట్లకు ఒప్పుకొంది. అన్ని విధాలుగా.. అన్ని అంశాలలో రాజీ పడింది. వాస్తవానికి కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ.. బిజెపికి తమిళనాడులో ఏమి చేయలేని పరిస్థితి. అందువల్లే ఏఐడీఎంకే ఆడించినట్టు ఆడింది. ఇంత చేసినప్పటికీ ఏమైనా ఉపయోగం ఉందా అంటే.. అది పలుచూపుమేరలో కూడా కనిపించడం లేదు.ఎగ్జిట్ పోల్స్ లో ఏ సంస్థ కూడా ఏఐటీఎంకే అధికారాన్ని దక్కించుకుంటుందని ప్రకటించలేదు.. పీపుల్ పల్స్ నుంచి మొదలు పెడితే చాణక్య స్ట్రాటజీస్ వరకు ప్రతి సంస్థ కూడా తమిళనాడు రాష్ట్రంలో డీఎంకే అధికారంలోకి వస్తుందని ప్రకటించాయి. ఇక్కడ ద్రావిడ సెంటిమెంట్ ముందు జాతీయవాదం పనిచేయదని నిరూపించాయి. తమిళనాడు రాష్ట్రంలో 180 ప్లస్ సీట్లతో డిఎంకె కూటమి విజయం సాధిస్తుందని స్మార్ట్ పోల్ సంస్థ ప్రకటించింది. ఇందులో ఏ ఐ డి ఎం కే కూటమికి కేవలం 28 సీట్లు మాత్రమే వస్తాయని ప్రకటించింది. ఓటు షేర్ విషయంలో కూడా కేవలం 27.6 చేత మాత్రమే లభిస్తుందని స్పష్టం చేసింది. మాట్రిజ్ సంస్థ భిన్నమైన ఫలితాన్ని చెప్పినప్పటికీ.. ఈ సంస్థకు అంత గొప్పగా క్రెడిబుల్టి లేదు. ఈ సంస్థ ఏఐడీఎంకే కూటమికి 87 నుంచి 110 సీట్లు వస్తాయని ప్రకటించింది.యాక్సిస్ మై ఇండియా సంస్థ ఏఐడీఎం కే కూటమికి 22 నుంచి 32 స్థానాలకు వస్తాయని వెల్లడించింష ది.. చాణక్య స్ట్రాటజీస్ కూడా ఏఐడీఎంకేకు తమిళనాడులో అధికారం రాదని స్పష్టం చేసింది. ఈ కూటమికి కేవలం 50 నుంచి 65 స్థానాలు మాత్రమే వస్తాయని వెల్లడించింది. వాస్తవానికి బిజెపి అధినాయకత్వం తమిళనాడు విషయంలో అంతగా చొరవ చూపలేదని తెలుస్తోంది. వెస్ట్ బెంగాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రముఖంగా ప్రచారం చేశారు. అక్కడి ఓటర్లను ప్రభావితం చేయడానికి ఎన్నో రకాలుగా ప్రయత్నాలు చేశారు. కానీ అదే దూకుడు తమిళనాడులో కొనసాగించలేకపోయారు. పైగా బిజెపి రాష్ట్ర నేతలు ఇక్కడ తలా ఒక దిక్కుగా మారిపోయారు. అన్నామలై మాటకు విలువ లేకపోవడంతో ఆయన ఎన్నికల్లో టచ్ మీ నాట్ అన్నట్టుగా వ్యవహరించారు. కొత్త అధ్యక్షుడు లేకి వ్యాఖ్యలు చేసి.. తమిళ హీరో విజయ్ కి క్షమాపణలు చెప్పారు. ఇక ఏఐడీఎంకే నేతలు కూడా ఇష్టానుసారంగా సీట్ల కేటాయింపు జరిపారు. అత్యంత కఠినమైన సీట్లను బిజెపికి ఇచ్చారు. ఈ విషయాన్ని బిజెపి అధినాయకత్వంతో స్థానిక నాయకులు చెప్పినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. ఫలితంగా తమిళనాడు ఎన్నికల్లో ఏఐడీఎం కే కూటమి మరోసారి విఫల బృందంగా మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.



# రోజ్ ఆపిల్ వేసవి కాలంలో ప్రత్యేకమైన పండు

కాలానుగుణంగా అనేక రకాల పండ్లు లభిస్తాయి. వేసవికాలం అనగానే అందరికీ ముందుగా మామిడిపండ్లు గుర్తుకువస్తాయి. కానీ మామిడిపండ్లు మాత్రమే కాకుండా వేసవికాలంలో అనేక రకాల ఇతర పండ్లు కూడా లభిస్తాయి. వాటిలో రోజ్ ఆపిల్ కూడా ఒకటి. రోజ్ ఆపిల్ లేదా సఫేద్ జామున్ వేసవి కాలంలో లభించే ప్రత్యేకమైన పండు. ఇది సుమారు 93 శాతం నీటిని కలిగి ఉండడంతో శరీరానికి సహజమైన హైడ్రేషన్‌ను అందిస్తుంది. దేశంలోని తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో ఇది ఎక్కువగా కనిపించినప్పటికీ మార్కెట్లో ఇది తక్కువగా వినియోగంలో ఉంది. ఈ పండులో తక్కువ క్యాలరీలు (10 గ్రాములకు 25-30 క్యాలరీలు) ఉండటం వల్ల దీన్ని తేలికపాటి ఆహారంగా పరిగణిస్తారు. అంతేకాకుండా ఫైబర్ సమృద్ధిగా ఉండటం వల్ల జీర్ణక్రియకు మేలు చేస్తుంది. విటమిన్ సి, పొటాషియం, యాంటీ ఆక్సిడెంట్లు వంటి సూక్ష్మపోషకాలు శరీర రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

**శరీరాన్ని చల్లబరిచేందుకు..**

రోజ్ ఆపిల్ పండు అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. ఇది శరీర ఉష్ణోగ్రతను తగ్గించే బ్లడ్ కూలెంట్ గా సంప్రదాయ వైద్యంలో ఉపయోగంలో ఉంది. వేసవిలో దాహాన్ని తగ్గించి, శరీర ద్రవ సమతుల్యతను నిలబెట్టడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్ కారణంగా బరువు నియంత్రణలో కూడా ఉపయోగపడుతుంది. అలాగే ఇది స్వల్ప విరేచన లక్షణాలతో జీర్ణ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. దేశంలో అధిక ఉష్ణోగ్రతలు (40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా) నమోదయ్యే వేసవిలో డీహైడ్రేషన్ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో సహజ పండ్ల వినియోగం ముఖ్యమవుతుంది. ప్యాకేజ్డ్ జ్యూసులు, చక్కెర పానీయాల బదులు రోజ్ ఆపిల్ వంటి పండ్లు ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయంగా నిలుస్తాయి. అయినప్పటికీ ఇది అన్ని ప్రాంతాల్లో సులభంగా లభ్యం కాకపోవడం ఒక సమస్యగా ఉంది.



## ఎలాగైనా తీసుకోవచ్చు..

రోజ్ ఆపిల్‌ను తినే విధానాలు కూడా సులభంగా ఉంటాయి. దీనిని చల్లగా నేరుగా తినవచ్చు. ఫ్రూట్ సలాడ్‌లో నిమ్మరసం లేదా ఉప్పుతో కలిపి తీసుకోవచ్చు. మింట్, కీరదోసతో కలిపి స్మూతీగా కూడా తయారు చేసుకోవచ్చు. అయితే పండిన, పాడైన పండ్లను తప్పనిసరిగా నివారించాలి. అయితే, అధిక మోతాదులో తీసుకుంటే కొన్ని దుష్ప్రభావాలు కూడా కలుగుతాయి. జీర్ణ సమస్యలు, పొట్ట నొప్పి, విరేచనాలు వచ్చే అవకాశం ఉంటుంది. కొంతమందిలో అలర్జీ ప్రతిచర్యలు కూడా కనిపిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. అందువల్ల మధుమేహ రోగులు జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా గింజలను తినడం హానికరం అవుతుంది. ఇక పండులోని గుజ్జును మాత్రమే తీసుకోవడం మంచిది. రోజ్ ఆపిల్ పండు వేసవిలో శరీరానికి తేమను అందించే సహజ ఆహారం. అయితే దీనిని పరిమిత మోతాదులో, జాగ్రత్తలతో తీసుకుంటేనే పూర్తి ప్రయోజనాలు పొందవచ్చని నిపుణులు తెలియజేస్తున్నారు.

# గ్యాస్, అజీర్తి, మలబద్ధకం వంటి జీర్ణ సమస్యలను తగ్గించే మిశ్రమం ఇది..



ఉదయం నిద్ర లేవగానే పొట్ట ఉబ్బరం, గ్యాస్, భారంగా అనిపించడం వంటి జీర్ణ సమస్యలు చాలా మందిని వేధిస్తుంటాయి. చాలా మంది ఈ సమస్యలకు మందులు వాడుతూ ఉంటారు. అయితే రోజంతా ఉత్సాహాన్ని తగ్గించే ఈ సమస్యలకు క్లిష్టమైన డైట్‌లు లేదా సప్లిమెంట్స్ అవసరం ఇకపై అవసరం పడకపోవచ్చు. సాధారణంగా ఇంట్లో లభించే కొన్ని పదార్థాలతోనే ఈ సమస్యలను తగ్గించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అరటి పండు, నిమ్మరసం, రాక్ సాల్ట్ (సేంద్రీయ ఉప్పు) ను ఉపయోగించి ఈ సమస్యల నుండి చాలా సులభంగా బయటపడవచ్చు. ఈ మిశ్రమాన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం వల్ల జీర్ణక్రియ సహజంగా ప్రారంభమవుతుంది. ఇది పొట్టపై ఒత్తిడి లేకుండా, నెమ్మదిగా జీర్ణవ్యవస్థను చురుకుగా చేస్తుంది.

**తయారు చేయడం ఇలా..**

అంతేకాకుండా ఈ మిశ్రమాన్ని తయారు చేయడం కూడా చాలా సులభం. కొంచెం గట్టిగా ఉన్న అరటి పండును తీసుకుని, దానిపై తాజా నిమ్మరసం పిండాలి. తర్వాత కొద్దిగా రాక్ సాల్ట్ చల్లి కలిపి తీసుకోవాలి. ఈ మూడు పదార్థాలు కలిపి ఒక ప్రభావవంతమైన జీర్ణవ్యవస్థ-ఫ్రెండ్లీ ఆహారంగా పనిచేస్తాయి. వీటిని కలిపి తీసుకోవడం వల్ల రాత్రి సమయంలో ఏర్పడే ఉబ్బరం తగ్గే అవకాశం ఉంటుంది. అలాగే గ్యాస్ సమస్యలు తగ్గి, మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. జీర్ణక్రియ మెరుగుపడటంతోపాటు జీర్ణ వ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియా సమతుల్యం కాపాడటానికి కూడా ఇది సహాయపడుతుంది. అరటి పండులో ఉండే ప్రీబయోటిక్ ఫైబర్ గట్ (జీర్ణ వ్యవస్థ)లో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతుంది. ఇది మలవిసర్జనను సులభతరం చేస్తుంది. నిమ్మరసం జీర్ణరసాల ఉత్పత్తిని పెంచి ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. రాక్ సాల్ట్ పొట్టలో ఆమ్ల ఉత్పత్తిని సపోర్ట్ చేసి గ్యాస్, ఉబ్బరం తగ్గించడంలో సహాయపడుతుంది.

**ఏ సమయంలో..**

ఈ మిశ్రమాన్ని ఉదయం ఖాళీ కడుపుతో తీసుకోవడం ఉత్తమం. ఇలా తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ రోజును సహజంగా ప్రారంభిస్తుంది. అవసరమైతే కొన్ని నానబెట్టిన బాదం పప్పులతో కలిపి తీసుకోవచ్చు, ఇది శక్తి స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. అయితే, అరటి పండు చాలా ముదురు కాకుండా కొద్దిగా గట్టిగా ఉన్నదాన్ని ఎంపిక చేయడం మంచిది. అలాగే ఏదైనా జీర్ణ సమస్యలు ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించడం అవసరం. చిన్న చిన్న ఆహారపు అలవాట్లు కూడా రోజువారీ జీర్ణక్రియపై పెద్ద ప్రభావం చూపిస్తాయి. ఈ సులభమైన మిశ్రమాన్ని అలవాటు చేసుకుంటే పొట్ట తేలికగా ఉండటమే కాకుండా, రోజంతా సౌకర్యంగా అనిపిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

## పెదవులు తరచూ పొడిబారుతున్నాయా.. అయితే ఈ చిట్కాలను పాటించండి



ముఖం అందంగా కనిపించడంలో పెదవులు కూడా ముఖ్య పాత్ర పోషిస్తాయి. పెదవుల అందాన్ని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కూడా చాలా ముఖ్యం. అయితే కొన్నిసార్లు పెదవులకు సంబంధించిన సమస్యలు కూడా తలెత్తూ ఉంటాయి. వాటిలో పెదవులు పొడిబారడం కూడా ఒకటి. ఈ సమస్యను చాలా మంది ఎదుర్కొనే ఉంటారు. పెదవులు పొడిబారడం (ణతీఎ ాఱఅజూం) చాలా మందిని వేధించే సాధారణ సమస్య. చల్లని వాతావరణం, ఎండ తీవ్రత, నీటి లోపం, తరచుగా పెదవులను నాలుకతో తడి చేయడం, కొన్ని కాస్మెటిక్ ఉత్పత్తులలో ఉండే రసాయనాలు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా ఉంటాయి. ముఖ్యంగా దాల్చిన చెక్క, సిట్రస్, మింట్, మెంతోల్, కర్పూరం వంటి పదార్థాలు కలిగిన ఉత్పత్తులు పెదవుల పొడిబార్పును మరింత పెంచుతాయి. అయితే డెర్మటాలజిస్ట్ లు సూచించినట్లుగా పెదవులు పొడిబారడాన్ని తగ్గించడానికి కొన్ని సులభమైన చిట్కాలు పాటిస్తే మంచి ఫలితాలు పొందవచ్చు. పెదవుల పొడాబారడాన్ని తగ్గించే సులభమైన చిట్కాల గురించి వారు వివరిస్తున్నారు. లిప్ బామ్‌ను నేరుగా అప్లై చేయకుండా ముందు స్వల్పంగా మాయిశ్చరైజర్‌ను రాయడం మంచిది. ఇది పెదవుల తేమను రక్షించడంలో సహాయపడుతుంది. అలాగే పెదవులను తరచుగా నాలుకతో తడి చేయడం ఒక చెడు అలవాటు. తాత్కాలికంగా తేమ ఇచ్చినట్టు అనిపించినా, ఇది సహజమైన ఆయిల్స్‌ను తొలగించి మరింత పొడిబార్పుకు దారి తీస్తుంది. దీంతో ఒక చక్రంలా సమస్య పెరుగుతుంది. మ్యాట్ లిప్‌స్టిక్‌లను, ముఖ్యంగా ఎక్కువసేపు ఉండే డార్క్ షేడ్స్‌ను నివారించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇవి ఎక్కువగా వాక్స్, పౌడర్ కలిగి ఉండటంతో పెదవులను మరింత పొడిగా మార్చే అవకాశం ఉంటుంది. బదులుగా గ్లోసీ లేదా ఇతర షేడ్స్‌ను ఉపయోగించడం మంచిది. అలాగే మొటిమల చికిత్స కోసం వాడే జెల్స్ (ఎవఅఓశీఎశ్రీ జూవతీశీఇఱఅవ, ఋశ్రీఅఎఎశ్రీఅఎ ఖఎఅం వంటి పదార్థాలు కలిగినవి) పెదవుల దగ్గర ఉపయోగించకూడదు. ఇవి చర్మంలోని ఆయిల్‌ను తగ్గించడానికి రూపొందించబడినవి కాబట్టి పెదవులకు చాలా కఠినంగా ఉంటాయి. రాత్రిపూట పెదవుల సంరక్షణ చాలా ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. నిద్రకు ముందు మాయిశ్చరైజర్‌ను రాసి, దాని పై పలుచని పెట్రోలియం జెల్లీ పొర వేస్తే ఉదయానికి పెదవులు తేమగా, మృదువుగా మారుతాయి. ఇటువంటి సులభమైన చిట్కాలను పాటించడం ద్వారా పెదవుల పొడిబార్పును తగ్గించుకోవచ్చు. సరైన సంరక్షణతో పెదవులు ఆరోగ్యంగా, చక్కగా కనిపిస్తాయని నిపుణులు తెలియజేస్తున్నారు.

# వేసవి తాపానికి లేజీ డ్రింక్



మండే ఎండల్లో కేవలం నీళ్లు మాత్రమే తాగితే చాలదు. శరీరానికి అవసరమైన ఎలక్ట్రోలైట్స్ కూడా అందాలి. అందుకే.. ఇప్పుడు చాలామంది 'లేజీ డ్రింక్' వెంట పడుతున్నారు. సాధారణ నీటి కంటే 10 రెట్లు ఎక్కువ హైడ్రేషన్ అందించే ఈ డ్రింక్‌ను చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు.

**కావలసిన పదార్థాలు**

నీటిలో నానబెట్టిన సబ్జా గింజలు: ఒక టేబుల్ స్పూన్ నీళ్లు/ కొబ్బరి నీళ్లు: ఒక గ్లాసు. నిమ్మరసం: ఒక టీస్పూన్ చక్కెర/ తేనె/ తాటి బెల్లం : రుచికి సరిపడా పుదీనా ఆకులు: నాలుగైదు

**తయారీ విధానం**


నానబెట్టిన సబ్జా గింజలను గ్లాసు నీటిలో వేయాలి. అందులో నిమ్మరసం, తేనె వేసి బాగా కలపాలి. చలవ కోసం పైన పుదీనా ఆకులు వేసి చల్ల చల్లగా తాగేయడమే!

**ఎన్నో ప్రయోజనాలు**

వేసవి తాపానికి 'సబ్జా గింజలు' సమర్థంగా చెక్ పెడతాయి. వాటి బరువు కంటే 10-12 రెట్లు ఎక్కువ నీటిని పీల్చుకుంటాయి. అందుకే.. సబ్జా గింజలతో చేసే డ్రింక్ శరీరానికి గంటల తరబడి హైడ్రేషన్ అందిస్తుంది. ఇక శరీరంలోని అంతర్గత వేడిని తగ్గించడంలోనూ ఇవి ముందుంటాయి. నిమ్మరసం, కొబ్బరి నీళ్లు కలపడం వల్ల సోడియం, పొటాషియం లాంటి ఎలక్ట్రోలైట్స్ కూడా శరీరానికి అందుతాయి. ఎండ వల్ల వచ్చే అలసటను తగ్గిస్తాయి. అంతేకాదు, రెగ్యులర్‌గా వాడుకునే వాటర్ బాటిల్‌లో కొన్ని సబ్జా గింజలను వేసుకుంటే చాలు. ఆ రోజంతా ఎక్కడికి వెళ్లినా ఆ నీటిని తాగుతూ హైడ్రేటెడ్‌గా ఉండవచ్చు. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు, వర్కవుట్స్ చేసిన తర్వాత ఈ నీటిని తాగితే తక్షణ శక్తి లభిస్తుంది.

# తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టే

# కార్యాచరణ వేగవంతం



**హైదరాబాద్ :** తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టే కార్యాచరణ వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ వేం నరేందర్ రెడ్డి తో పాటు నీటి పారుదల శాఖకు చెందిన సీనియర్ అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎంత ఎత్తున నిర్మించాలి, ఎంత ఎత్తులో నిర్మిస్తే ఎంత నీటిని వినియోగించుకునే వీలుందని సమావేశంలో అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు కోసం తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే దాదాపు 11 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందని, కొన్ని ప్రాంతాల్లో కాల్వల నిర్మాణం కూడా జరిగింది. 71.5 కిలోమీటర్ల మేరకు కెనాల్ వర్క్ జరిగిందని అధికారులు వివరించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే కనీసం 100 టీఎంసీల నీటిని వినియోగించుకునే వీలుంటుందని, తెలంగాణ ప్రయోజనాలు నెరవేరుతాయని సూచించారు. ఇప్పటికే పూర్తయిన నిర్మాణాల న్నిటిని సద్వినియోగం చేసుకునేందుకు 150 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మించాలని నిపుణులు సూచించారు.గతంలో జరిగిన చర్చల ప్రకారం మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తు నిర్మించేందుకు అంగీకరించిందని, 152 మీటర్ల ఎత్తు నిర్మిస్తే మహారాష్ట్ర పరిధిలో ముంపు ప్రభావం ఉంటుందని మధ్యేమార్గంగా 150 మీటర్ల ఎత్తు నిర్మిస్తే తక్కువ ఖర్చుతో నీటిని తీసుకునే వీలుందని ఇంజనీరింగ్ నిపుణులు సూచించారు.తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపడితే ఆదిలాబాద్‌తో పాటు తెలంగాణలో మెట్ట ప్రాంతాల రైతులకు సాగు, తాగు నీటిని అందించవచ్చుని, అలాగే, తక్కువ ఖర్చుతో గ్రావిటీపై శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు నీటిని తరలించేందుకు వీలుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు.ప్రాజెక్ట్ ప్రాధాన్యత దృష్ట్యా వెంటనే మహారాష్ట్రతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. 150 మీటర్ల ఎత్తున నిర్మిస్తే మహారాష్ట్రలో పెద్దగా ముంపు ప్రభావం ఉండదని, ఎక్కడైనా ముంపు వాటిల్లితే పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.మహారాష్ట్రలో బీజేపీ అధికారంలో ఉన్నందున ఆ ప్రభుత్వాన్ని ఒప్పించి తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని కోరుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కి వెంటనే లేఖ రాయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి సూచించారు.తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మించాల్సిన అవసరం ఉన్నందున మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని కిషన్ రెడ్డి కి తెలంగాణ రైతుల తరపున కూడా విజ్ఞప్తి చేయాలని చెప్పారు.

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక అవగాహన సదస్సు



**సిద్దిపేట :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా, సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళా భద్రత మరియు గృహ హింస నివారణపై గురువారం ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుషాల్కర్ మరియు అడిషనల్ డీసీపీ ఏఆర్ సుభాష్ చంద్రబోస్ హాజరయ్యారు. సదస్సులో ముఖ్యాంశాలు: సదస్సును ఉద్దేశించి అడిషనల్ డీసీపీ కుషాల్కర్ మాట్లాడుతూ. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం మరియు పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. మహిళల రక్షణ కోసం ఉన్న వివిధ చట్టాల గురించి, ముఖ్యంగా గృహ హింస నిరోధక చట్టం మరియు వేధింపులకు వ్యతిరేకంగా ఉన్న సెక్షన్ల గురించి అవగాహన కల్పించారు. మహిళలు ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, 'షీ టీమ్స్' సేవలు మరియు డయల్ 100 వినియోగంపై సూచనలు చేశారు. సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలైన బాల్య వివాహాలు, సైబర్ వేధింపులు మరియు వరకట్న వేధింపుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. సమాజంలో ఆడ, మగ ఇద్దరూ సమానమేనని, మహిళలకు గౌరవం లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు.ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకోవాలి. భయం వీడి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలి. మహిళల భద్రతకు సిద్దిపేట పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటామని అడిషనల్ డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ తెలియజేశారు. అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయడం జరిగినదని. ఈ సదస్సులో స్థానిక పోలీసు అధికారులు ఏసిపి రవీందర్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, టు టౌన్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ , ఉమెన్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ ఎబి. దుర్గా, న్యాయవాది రోహిణి, డిప్యూటీ డిఆర్డిఓ సుదీర్ బాబు, స్నేహిత ఎన్జీవో ఆర్గనైజేషన్ వసంత మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# ఉద్యోగుల భద్రత సైబర్, లింగ సమానత్వం,నేరాలపై అప్రమత్తత అవసరం




**వనపర్తి :** భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం, సైబర్ క్రైం, సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన సైబర్ నేరాలు, లింగ వివక్ష, వేధింపుల నివారణపై సూచనలు భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం సంయుక్త ఆధ్వర్యంలో ఉద్యోగులకు అవగాహన సమాజంలో సురక్షిత వాతావరణం నెలకొనాలంటే ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండాలని కార్యాలయాల్లో లింగ సమానత్వం, మహిళల గౌరవం ప్రతి సంస్థ బాధ్యతగా భావించాలని వనపర్తి డీసిఆర్బి డీఎస్పీ, బాలాజీ నాయక్ అన్నారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలల భద్రత, రక్షణ, మాదకద్రవ్యాల వ్యతిరేక సంక్షేమ వారోత్సవాలలో భాగంగా బుధవారం 3వ రోజు కార్యక్రమం వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం సంయుక్తంగా ఉద్యోగులు, సిబ్బంది మరియు సంస్థల ప్రతినిధులకు లింగ సమానత్వం, సైబర్ నేరాలు, వేధింపుల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఉద్యోగి అప్రమత్తంగా ఉండటం అత్యంత అవసరం. తెలియని లింకులు, కాల్స్, మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. కార్యాలయాల్లో మహిళలపై ఎటువంటి వేధింపులు జరిగినా వెంటనే ఫిర్యాదు చేయాలని, లింగ సమానత్వం ప్రతి సంస్థలో అమలు కావాలని కోరుతున్నాము. సురక్షితమైన పని వాతావరణం ఏర్పడితేనే సంస్థలు అభివృద్ధి సాధిస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్,మల్లికార్జున్, ఏ హెచ్ టి యు ఎస్సై,అంజద్, సైబర్ క్రైమ్ ఎస్సై,రవి ప్రకాష్, భరోసా కోఆర్డినేటర్, శిరీష, షీ టీం సిబ్బంది, శ్రీనివాసులు, శ్రీశైలం, యాజిరెడ్డి,సైబర్ క్రైం, సిబ్బంది, విజయ్, లోకేష్, పవన్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పోలీసు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# పదో తరగతి ఫలితాల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులతో సత్తా చాటిన వనపర్తి విద్యాసంస్థలు

**వనపర్తి :** పదో తరగతి ఫలితాలలో వనపర్తి పట్టణంలోని పలు విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించి మరోసారి తమ ప్రతిభను చాటారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రిసింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విద్యార్థుల ను అభినందించారు. అనుస్ అకాడమిలో చదువుతున్న టిఆర్ఎస్వి నాయకులు భాగ్యరాజ్ కుమార్తె అక్షర 547/600 మార్కులు సాధించి మంచి ప్రతిభ కనబరిచింది. వనపర్తి టౌన్ ఫస్ట్‌గా, జిల్లా సెకండ్‌గా డా. సీ.వి. రామన్ టాలెంట్ స్కూల్ విద్యార్థిని ఎ. సంజన 582/600 మార్కులతో అద్భుత ఫలితం సాధించింది. సీ.వి. రామన్ టాలెంట్ స్కూల్ చెందిన మరో విద్యార్థిని మదిహ 564/600 మార్కులు సాధించి ప్రతిభను చాటింది. ఈ సందర్భంగామాజీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు అందించిన ప్రోత్సాహమే ఈ విజయాలకు కారణమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, ప్రేమ్ నాథ్ రెడ్డి, నాగన్న యాదవ్, నరసింహ,కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్, సుబ్బు నందిమల్ల, సయ్యద్ జమీల్, అలీమ్, వంశీ, కుమార్, సంతోష్, అరుణ్, తదితరులు పాల్గొన్నారు



## మెడికల్ మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

### ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా సమితి డిమాండ్



**నరసరావుపేట :** పల్నాడు జిల్లాలో జరుగుతున్న మెడికల్ మాఫియా అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అఖిల భారత యువజన సమాఖ్య పల్నాడు జిల్లా సమితి ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ కార్యాలయము ఎదుట నిరసన వ్యక్తం చేసి కార్యాలయం సిబ్బందికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఒఎజఈ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు మహంకాళి సుబ్బారావు,సుభాని మాట్లాడుతూ జిల్లాలో ఈ మధ్యకాలంలో హాస్పిటల్స్ మరియు కొంతమంది మెడికల్ స్టోర్లు ప్రభుత్వ నిబంధనలు పూర్తిగా ఉల్లంఘిస్తూ, ధనార్జన ధ్యేయంగా నకిలీ మందులు అమ్ముతున్నారని ఈ విషయం డ్రగ్ అధికారులకు తెలిసిన నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్నారని వారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రులు ప్రజారోగ్యాన్ని సేవగా భావించకుండా వ్యాపారంగా మార్చి దోపిడికి పాల్పడుతున్నారని వారన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల బలహీనతను ఆసరాగా చేసుకొని అవసరానికి మించిన బిల్లులు వేయటం, అవసరంలేని పరీక్షలు మరియు చికిత్సలు చేయించడం ద్వారా వారి ఆర్థిక పరిస్థితిని దెబ్బతిస్తున్నారు. ఇక మరోవైపు జిల్లాలో కొంతమంది మెడికల్ స్టోర్లు చట్టాలను పక్కనపెట్టి ప్రిస్క్రిప్షన్ లేకుండా మత్తుమందుల విక్రయం, అనుమతి లేని అబార్షన్ మాత్రల రహస్య అమ్మకాలు లైసెన్స్ లేకుండా మెడికల్ షాపులు నిర్వహణ వంటి అక్రమాలకు పాల్పడుతున్నారు అని అన్నారు. ఈ పరిస్థితి సాధారణ ప్రజల ఆరోగ్యం పై తీవ్ర ప్రభావం చూపుతుంది. కాబట్టి ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. లైసెన్స్ లేని మెడికల్ స్టోర్లను తక్షణమే సీజ్ చేయాలి. అన్ని మెడికల్ షాపులు, ప్రైవేట్ హాస్పిటల్స్ పై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలి, అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చట్టపరమైన చర్య తీసుకోవాలి, మెడికల్ షాపులో రికార్డులు సక్రమంగా నిర్వహిస్తున్నారా అనేదానిపై అధికారులు పరిశీలన చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మేకపోతుల నాగేశ్వరరావు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, నాగరాజు, బొంత పృథ్వి, కె.దుర్గా, జగదీష్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రేణుక ఏడాదిన్నరలో ముగ్గురిని మార్చింది..

### పైగా ప్రైవేట్ వీడియోలు.. కన్నీళ్లు పెట్టిస్తున్న భర్త లెటర్..

**హైదరాబాద్ :** నా భార్య రేణుకకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ.. ఆమె ఏడాదిన్నరలోనే ముగ్గురితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.. అంతేకాకుండా.. ప్రైవేట్ వీడియోలను రికార్డు చేసుకోగా.. ఓ లవర్ దానిని ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశాడు. ఆ దారుణాలను చూసి నేను ఎలా తట్టుకోగలగాలి.. అసలు రేణుకకు అసలు ఏం కావాలి.. ప్రేమ నా లేక శృంగారమా..? " అంటూ ఓ భర్త.. ఏకంగా 19 పేజీల సూసైడ్ నోట్ రాసి.. ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య అరాచకాలకు మరో భర్త బలైపోయిన సంఘటన హైదరాబాద్ నగరంలో సంచలనంగా మారింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం ఆ లేఖలో ప్రస్తావించిన విషయాలు సంచలనంగా మారాయి.. ఏ అమ్మాయి కూడా అలా చేయవద్దంటూ సీతారాం తన వేదనను లేఖ రూపంలో పంచుకున్నాడు. ఏపీలోని మార్కాపురానికి చెందిన సీతారాం, నంద్యాలకు చెందిన రేణుకకు 2018లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాచుపల్లిలో నివాసం ఉండేవారు.. ఈ క్రమంలోనే.. భార్య వివాహేతర సంబంధాలు బయటపడటం, ఇన్‌స్టాలో వీడియోలు బయటపడటంతో ఫిబ్రవరిలో ట్యాంక్‌బండ్ లో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.అయితే.. సీతారాం తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా సంచలన విషయాలు వెలుగుచూశాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం రాసిన 19 పేజీల సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్నారు.తన భార్య వివాహేతర సంబంధాలే తన చావుకు కారణం అంటూ సీతారాం లేఖలో ప్రస్తావించాడు.. 19 పేజీల్లో రేణుక వివాహేతర సంబంధాలపై పూర్తి విషయాలు రాశాడు.. రేణుక ముగ్గురితో వివాహేతర సంబంధం పెట్టుకుందని.. ఏడాదిన్నరలోనే ముగ్గురితో వివాహేతర సంబంధం నడిపిందని తెలిపాడు. ఒకరితో ప్రైవేట్‌గా ఉన్న సమయంలో ఆ వీడియోలను రికార్డ్ చేసిందని తెలిపాడు.."ఒక అమ్మాయి ప్రైవేట్ వీడియోలను రికార్డ్ చేయడం ఏంటి? రమణ అనే వ్యక్తి ఆ వీడియోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు.. అవి చూసి నేను ఎలా తట్టుకోవాలి? అవి చూశాకే తెలిసింది నా భార్య నిజస్వరూపం.. నా భార్యకు ఏలోటు రాకుండా చూసుకున్నా.. కానీ ఆమె నాకు నమ్మక ద్రోహం చేసింది".. అంటూ సూసైడ్ లెటర్‌లో సీతారాం ఆవేదన వ్యక్తంచేశాడు.. తాను ఇంట్లో లేని సమయంలో రమణ పలుమార్లు ఇంటికి వచ్చి రేణుకతో గడిపాడని.. అసలు రేణుకకు ఏం కావాలి.. అంటూ ఆ లేఖలో ప్రశ్నించాడు సీతారాం..కాగా.. ఈ ఏడాది ఫిబ్రవరిలో హుస్సేన్ సాగర్‌లో దూకి ఆత్మహత్య చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఈ సూసైడ్ కేసులో ఇప్పటికే ముగ్గురు అరెస్టయ్యారు. రేణుకతో పాటు ఆమె ఇద్దరు లవర్స్ రమణారెడ్డి, శ్రవణ్ అరెస్ట్ అయినట్లు పోలీసులు తెలిపారు.

## కోహెడ మండల కేంద్రంలో మండల

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం:

### ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్



**కోహెడ :** మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆఫ్ లైన్ నుండి ఆన్ లైన్ కి ఉండడం వల్ల రైతులకు ఇబ్బందులు రావడం వల్ల మళ్ళీ ఆఫ్ లైన్ లో కొనుగోలు కేంద్రాలు జరుగుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ రైతులకు మనం అండగా ఉన్నామని తెలియడానికి ఐదుగురు సభ్యులతో కమిటీ వేస్తున్నాం.గ్రామాల్లో తాగునీరు సరఫరా లో ఇబ్బందులు రాకుండా చూసే బాధ్యత మనది అధికారులతో సమన్వయం చేయడానికి ఈ అంశం మీద ఐదుగురు సభ్యులతో ఒక కమిటీ ఏర్పాటు చేస్తున్నాం.ప్రభుత్వం పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో మంచి అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి మనమంతా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నాం.ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలి బడి బాట కార్యక్రమంలో భాగంగా అడ్మిషన్ల సంఖ్య పెంచేలా ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.ప్రతి ఒక్కరు ఒక మొక్క నాటెల చర్యలు తీసుకోవాలికోహెడ మండలంలో ప్రతి గ్రామంలో ఆర్వీఎం మెడికల్ కాలేజీ ద్వారా హెల్త్ క్యాంప్ లు ఏర్పాటు చేస్తున్నాం అందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి.గ్రామాల్లో ప్రతి బూత్ లో బిఎల్ఏ నియమించాలి ఓట్ల సవరణ సర్ ద్వారా బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల్లో లక్షల సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారు.తొలగించే ఓట్లు జాగ్రత్తగా పరిశీలించారు దొంగ ఓట్లు వచ్చిన అధికారుల దృష్టికి తీసుకోవాలి.ఈ సమావేశంలో గ్రామాలు వేరు వేరుగా కూర్చొని సమావేశం ఎర్పాటు చేసుకొని గ్రామాల సమస్యలు,పెండింగ్ పనులు అంశాలు చెప్పడంతో పాటు ఐదు అంశాలపై ఐదుగురు సభ్యులతో కమిటీ ఇవ్వాలి.గ్రామాల్లో,మండలాల్లో పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకోవాలిప్రజా పాలన ప్రభుత్వం లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకోవాలి. ఈ సమావేశంలో పీసీసీ జనరల్ సెక్రటరీ సౌజన్య,మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య,మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్మలా జయరాజ్, కోహెడ సర్పంచ్ బందెల సుజాత-బాలకిషన్ వివిధ గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డు సభ్యులు,ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# క్వైట్ క్విటింగ్ ఎంప్లాయ్

# సైలెంట్ ప్రొటెస్ట్

## ఇది ఉద్యోగుల బద్ధకమా.. లేక వ్యవస్థ వైఫల్యమా..?



ఈ మధ్య ఆఫీసుల్లో తరచుగా వినిపిస్తున్న మాట 'క్వైట్ క్విటింగ్' పేరు వినగానే ఇదేదో ఉద్యోగులు సైలెంట్‌గా రాజీనామా చేసి వెళ్లిపోవడమనో, లేక వాళ్ల బద్ధకమనో అనుకుంటే పొరపాటే. నిజానికి ఇదొక 'సైలెంట్ ప్రొటెస్ట్'. కాంట్రాక్ట్‌లో ఎంత రాసి ఉంటే అంతే పని చేయడం, జీతానికి మించి ఒక్క నిమిషం కూడా అదనంగా కష్టపడకపోవడమే ఈ సరికొత్త ట్రెండ్.

ఒక హెచ్‌ఆర్ కోణంలో, క్షేత్ర స్థాయిలో దీని గురించి లోతుగా పరిశీలిస్తే.. ఒక ఉద్యోగి మానసికంగా సంస్థకు ఇలా దూరమైపోవడానికి ప్రధాన కారణం ఉద్యోగులు కాదు, ఆ సంస్థ వర్క్ కల్చర్, యాజమాన్య తీరు మాత్రమే అని స్పష్టంగా అర్థమవుతుంది. అసలు ఒక ఎంప్లాయీ ఈ స్థితికి ఎందుకు చేరుకుంటాడో ప్రాక్టికల్‌గా ఆలోచిద్దాం.

**1. గుర్తింపు కరువైనప్పుడు**

ఒకసారి ఊహించుకోండి.. ఒక ఉద్యోగి తన టీమ్ కోసం, ప్రాజెక్ట్ కోసం రాత్రింబవళ్లు కష్టపడినప్పుడు మేనేజ్‌మెంట్ నుండి కనీసం ఓ చిన్న ప్రశంస దక్కకపోతే ఎలా ఉంటుంది? "నేను నా పరిధి దాటి ఎంత కష్టపడినా ఎవరూ గుర్తించడం లేదు కదా.. ఇంక నాకెందుకు ఈ ఎక్స్‌ట్రా టెన్షన్?" అనే నిర్లిప్తత మొదలవుతుంది. క్వైట్ క్విటింగ్‌కు తొలి బీజం పడేది ఇక్కడే.

**2. నమ్మకం వమ్ము అయినప్పుడు**

సంస్థకు, ఉద్యోగికి మధ్య పేపర్ల మీద ఉండే కాంట్రాక్ట్ కన్నా, ఒక మానసిక ఒప్పందం బలంగా ఉంటుంది. కష్టపడితే ప్రమోషన్ వస్తుందనో, మంచి హైక్ వస్తుందనో వారు ఆశిస్తారు. కానీ పదేపదే ఆ అంచనాలను మేనేజ్‌మెంట్ అందుకోలేకపోయినప్పుడు, పక్షపాతంగా వ్యవహరించినప్పుడు ఆ సైకలాజికల్ బాండ్ కాస్తా తెగిపోతుంది. ఇక అప్పట్నుంచి ఉద్యోగాన్ని కేవలం ఒక 'డ్యూటీ' లాగా మాత్రమే చూస్తారు.

**3. ఉచిత సేవ ఎన్నాళ్లు?**

"మనమంతా ఒక ఫ్యామిలీ" అనే డైలాగులు కార్పొరేట్ ప్రపంచంలో చాలా కామన్. దీని ముసుగులో ఒకరి పనిని ఇద్దరి మీద రుద్దడం, వీకెండ్స్‌లో కూడా లాప్‌టాప్ ముందు కూర్చోబెట్టడం చేస్తుంటారు. పని భారం పెరుగుతోంది కానీ, దానికి తగ్గట్టుగా జేబులో పడే జీతం పెరగనప్పుడు ఎవరైనా సరే తమకంటూ కొన్ని బౌండరీస్ గీసుకుంటారు.

**4. ఎదుగుదల లేనప్పుడు**

ఏళ్ల తరబడి ఒకే రోల్, ఒకే రకమైన పని. కెరీర్ పరంగా ట్రైనింగ్, లేదా ప్రొమోషన్స్ ఎలాంటి అవకాశాలూ లేనప్పుడు తీవ్రమైన బోర్ వస్తుంది. ఎటూ ఎదుగుదల లేనప్పుడు అదనపు బాధ్యతలు నెత్తిన వేసుకుని లాభం లేదనే నిర్ణయానికి ఎంప్లాయీస్ వచ్చేస్తారు.

**5. అసలైన విలన్ - టాక్సిక్ కల్చర్:**

వీటన్నింటికీ మించి ఉద్యోగులను కుంగదీసేది మేనేజర్ల తీరు. అడుగడుగునా నిఘా పెట్టే మైక్రో-మేనేజ్‌మెంట్, పర్సనల్ టైమ్‌కి విలువ ఇవ్వకపోవడం, తప్పు జరిగితే అందరి ముందు నిందించడం.. ఈ వాతావరణం ఉద్యోగులను మానసికంగా అలిసిపోయేలా చేస్తుంది. ఆ వాతావరణంలో ఇమడలేక, అలాగని వెంటనే జాబ్ వదిలేయలేక మిషన్ లాగా పనిచేస్తుంటారు.

**"మరి దీనికి పరిష్కారం ఏంటి?"**

నిజాయితీగా చెప్పాలంటే, క్వైట్ క్విటింగ్ అనేది మేనేజ్‌మెంట్ సృష్టించుకున్న సమస్య. దీనికి మందు కూడా వాళ్ల దగ్గరే ఉంది.

ఉద్యోగులను యంత్రాల్లా చూడటం మానేసి, వారి శ్రమకు తగ్గ వేతనం, గుర్తింపు ఇవ్వాలి.

"పని చేయండి" అని ఆర్డర్లు వేయడం కాదు, వాళ్లతో కూర్చుని ఓపెన్‌గా మాట్లాడి (వన్ - ఆన్ - వన్ మీటింగ్స్) సమస్యలు వినాలి.

ఆఫీస్ టైమ్ అయిపోయాక వారి పర్సనల్ టైమ్‌ను గౌరవిస్తూ వర్క్-లైఫ్ బ్యాలెన్స్‌ను ప్రోత్సహించాలి.

పని వాతావరణం ప్రశాంతంగా, ఎంకరేజింగ్‌గా ఉంటే.. ఏ ఉద్యోగీ క్వైట్ క్విటింగ్ చేయడు సరికదా, సంస్థ కోసం తన వంతుకు మించి కష్టపడతాడు.



INSPIRE HR
సరైన హెచ్‌ఆర్
FOR ORGANIZATIONS & HR PROFESSIONALS

## రిలయన్స్ రిటైల్ చేతికి ప్రియాంక చోప్రా అనోమలి


రిలయన్స్ రిటైల్ లిమిటెడ్ సంస్థ.. ప్రియాంక చోప్రాకు చెందిన గ్లోబల్ హెయిర్‌కేర్ బ్రాండ్ 'అనోమలి'ని, దాని ట్రేడ్‌మార్క్‌లు, బ్రాండ్ ఆస్తులు, డిజిటల్ ప్రాపర్టీలతో సహా కొనుగోలు చేసినట్లు ప్రకటించింది. దీనికి సంబంధించిన ట్వీట్ కూడా కంపెనీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించింది. అనోమలి కొనుగోలు.. రిలయన్స్ రిటైల్ బ్యూటీ పోర్ట్‌ఫోలియోను గణనీయంగా విస్తరించనుంది. అంతేకాకుండా, భారతదేశంలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా సంస్థ తన వృద్ధిని సాధించే బ్రాండ్‌లను నిర్మించి, విస్తరించాలనే దాని నిబద్ధతను కూడా ఇది బలపరుస్తుంది. అనోమలి బ్రాండ్‌ను 2021లో ప్రముఖ నటి, వ్యాపారవేత్త ప్రియాంక చోప్రా ప్రారంభించారు. ఇది అందుబాటు ధరలో లభించే ఒక పాపులర్ హెయిర్‌కేర్ బ్రాండ్. ప్రారంభం నుంచే అత్యధిక ప్రజాదరణ పొందిన ఈ బ్రాండ్.. కొద్ది కాలంలోనే బలమైన అంతర్జాతీయ ఉనికిని ఏర్పరచుకుంది. ఈ కొనుగోలుతో రిలయన్స్ రిటైల్ తమ బ్యూటీ అండ్ పర్సనల్ కేర్ రంగంలో ఉన్న పోర్ట్‌ఫోలియోను మరింత విస్తరించింది. ఈ సంస్థ ఇప్పటికే భారతదేశంలో పెద్ద రిటైల్ నెట్‌వర్క్, డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను కలిగి ఉంది. ముఖ్యంగా టీరా వంటి ఓమ్నీచానల్ బ్యూటీ ప్లాట్‌ఫారమ్ ద్వారా వినియోగదారులకు విభిన్న బ్రాండ్లను అందిస్తోంది. ఇప్పుడు అనామలీ కూడా ఈ వ్యవస్థలో చేరడంతో, బ్రాండ్ మరింత వేగంగా విస్తరించే అవకాశం ఉంది. రిలయన్స్ రిటైల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఇషా అంబానీ ఈ కొనుగోలు గురించి మాట్లాడుతూ.. అనోమలి తమ బ్యూటీ పోర్ట్‌ఫోలియోలో ఒక ముఖ్యమైన భాగమవుతుందని చెప్పారు. ప్రత్యేకంగా భారత మార్కెట్‌పై దృష్టి పెట్టి.. జుట్టు, చర్మ అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కాగా ప్రియాంక చోప్రా బ్రాండ్ క్రియేటివ్ డైరెక్టర్‌గా కొనసాగుతారని వెల్లడించారు.

## చారిత్రక కనిష్ఠస్థాయికి పడిపోయిన విలువ

**ముంబై :** దేశీయ కరెన్సీ విలువ మరింత కరిగిపోయింది. డాలర్‌తో పోలిస్తే మారకం విలువ చారిత్రక కనిష్ఠ స్థాయికి జారుకున్నది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే కరెన్సీ విలువ 20 పైసలు కోల్పోయి ఆల్‌టైంకు కనిష్ఠ స్థాయి 94.88కి పడిపోయింది. ఇంధన ధరలు భగ్గుమనడంతో రూపాయితోపాటు ఇతర కరెన్సీలు తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనయ్యాయని ఫారెక్స్ డీలర్ వెల్లడించారు. దీనికి తోడు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడిదారులు భారీగా నిధులను తరలించుకుపోవడం కూడా రూపాయి పతనానికి ఆజ్యంపోశాయి. బ్యారెల్ క్రూడాయిల్ ధర 115 డాలర్ల పైకి చేరుకోవడంతో దేశీయ దిగుమతుల భారం మరింత పెరగనున్నదని, అలాగే పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా ఆందోళనను మరింత పెంచిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పరిస్థితులు అంతా ఆశాజనకంగా లేకపోవడంతో అమెరికా ఫెడరల్ రిజర్వు ఈసారి ద్రవ్యపరపతి సమీక్షలో కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలుండటం కూడా పెట్టుబడిదారుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని పేర్కొన్నారు. 94.79 వద్ద ప్రారంభమైన డాలర్-రూపీ ఎక్స్చేంజ్ రేటు చివరకు 20 పైసల నష్టంతో 94.88 వద్దకు పడిపోయింది.

# అదానీ పవర్ మెరుపులు.. మెరిపించిన ప్రాఫిట్

**న్యూఢిల్లీ:** ప్రయివేట్ రంగ విద్యుత్ దిగ్గజం అదానీ పవర్ గత ఆర్థిక సంవత్సరం(2025--26) చివరి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జనవరి--మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 64 శాతం జంప్‌చేసి రూ. 4,271 కోట్లను అధిగమించింది. ఆదాయంలో వృద్ధి, తగ్గిన పన్ను వ్యయాలు ఇందుకు దోహదపడ్డాయి. అంతక్రితం ఏడాది(2024--25) ఇదే కాలంలో కేవలం రూ. 2,599 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 14,535 కోట్ల నుంచి రూ. 15,989 కోట్లకు ఎగసింది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి రూ. 12,971 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2024--25లో రూ. 12,750 కోట్ల లాభం అందుకుంది. 2026 మార్చి31కల్లా మహన్(1,600 మెగావాట్లు), రాయ్‌పూర్ (1,600 మెగావాట్లు), రాయ్‌గఢ్(1,600 మెగావాట్లు) రెండో దశల పనులు 86--47 శాతం మధ్య పూర్తయినట్లు కంపెనీ వెల్లడించింది. సొంత అనుబంధ కంపెనీ కోబ్రా పవర్ 1320 మెగావాట్ల రెండో దశ ఈ ఆర్థిక సంవత్సరం(2026--27)లో పూర్తికాగలదని పేర్కొంది. 2031--32కల్లా 23.7 గిగావాట్ల థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతేడాది క్యూ4లో మహారాష్ట్ర విద్యుత్ బోర్డు



నుంచి 25ఏళ్లపాటు 1,600 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఎల్‌వోఏను అందుకుంది.

## ఐటీ రంగాన్ని మార్చనున్న ఏఐ: ఇన్ఫోసిస్ సీఈఓ

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై పలువురు ప్రముఖులు స్పందిస్తూనే ఉన్నారు. తాజాగా ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ తన అభిప్రాయం వెల్లడించారు. కృత్రిమ మేధస్సు.. భారతదేశ ఐటీ రంగంలో చాలా పెద్ద మార్పులను తీసుకురానుంది. అయితే, ఈ మార్పులు ఉద్యోగాలను తగ్గించవని, ప్రతిగా మరిన్ని అవకాశాలను సృష్టిస్తాయని ఆయన స్పష్టం చేశారు. భారతీయ ఐటీ కంపెనీలు ఇప్పటివరకు.. ఎక్కువగా కొత్తగా కాలేజీ నుంచి వచ్చిన యువతను పెద్ద సంఖ్యలో నియమించుకొని, అనుభవజ్ఞులను తక్కువగా ఉంచే పిరమిడ్ నిర్మాణాన్ని అనుసరించాయి. కానీ ఄ× ప్రభావంతో ఈ నిర్మాణం "డైమండ్" ఆకారంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంటే.. మధ్యస్థ, ఉన్నత నైపుణ్యాలు కలిగిన నిపుణుల అవసరం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ఈ పరిణామం ఒక్కసారిగా జరిగేది కాదు. ఉదాహరణకు.. గత ఆర్థిక సంవత్సరంలో ఇన్ఫోసిస్ 20,000 మంది కొత్త గ్రాడ్యుయేట్లను నియమించగా, ఈ సంవత్సరం కూడా దాదాపు అదే స్థాయిలో నియామకాలు కొనసాగనున్నాయి. దీన్నిబట్టి చూస్తే.. ఇన్ఫోసిస్ కంపెనీ ఇప్పటికే ఄ× ఆధారిత భవిష్యత్తుకు తగిన విధంగా తన వ్యూహాలను మార్చుకుంటోందని తెలుస్తోంది. కొత్తగా చేరే ఉద్యోగులకు కంపెనీ సాధారణ సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌తో పాటు, ఫౌండేషన్ మోడల్ టూల్స్‌పై కూడా శిక్షణ ఇస్తోంది. సీఈఓ సలీల్ పరేఖ్ ప్రకారం.. ఏఐ సేవలలో సుమారు 300 బిలియన్ డాలర్ల మార్కెట్ అవకాశం ఉంది. ఇన్ఫోసిస్ తన సేవలను విస్తరించడమే కాకుండా, ఇప్పటికే ఉన్న సేవల్లో ఄ×ని సమీకరిస్తోంది. దీనివల్ల కస్టమర్లు తమ వ్యాపారాన్ని మరింత విస్తరించుకునే అవకాశాలు పొందుతున్నారు.

